

గురువారం విజయవాడలో పోలీసు తనిఖీలు

శిరసావహించాల్సిందే..

ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో హెల్మెట్‌ధారణ ఇక తప్పనిసరి



- నిత్యం పోలీసులతో తనిఖీలు
- మొదటిసారి తప్పునకు జరిమానా
- పదేపదే ఉల్లంఘిస్తే వాహనం సీజ్
- పరిస్థితి మారకపోతే లైసెన్స్ సస్పెన్షన్
- సీపీ రాజశేఖరబాబు ఆదేశాలు

ఒక్కరోజు.. 2,567 కేసులు.. రూ.9.91 లక్షల జరిమానా

ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు గురువారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 2,657 కేసులు నమోదు చేశారు. తద్వారా రూ.9లక్షల91వేల265 చలానాలు విధించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో హెల్మెట్‌ధారణ, చలానాల విధింపులపై అవగాహన పెంపునకు ఆటోల్లో మైకులతో ప్రచారం చేయిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హెల్మెట్ నిబంధనను పోలీసులు కఠినం చేశారు. ఇప్పటివరకు కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని భావిస్తున్నారు. ఇక నుంచి నిత్యం వాహనదారులను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిరంతరం హెల్మెట్ ధారణకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులను ఇందుకు ఉపయోగించనున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వాహనదారులకు జరిమానా విధించడమే కాకుండా, పదేపదే ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేయాలని నిర్ణయించారు. కొన్ని రోజులుగా చలానాల సంఖ్య పెరుగుతోంది. హైకోర్టు స్పందనకు ముందు రోజుకు 200 నుంచి 300 వరకు కేసులు నమోదు చేసేవారు.

మిగతా 6లో..



నాట్య సాధన చేస్తున్న కళాకారులు

నేటి నుంచి కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలు

- మూడు రోజుల వేడుకకు ముస్తాబైన కూచిపూడి గ్రామం
- రోజూ ఉదయం ప్రసంగాలు, సాయంత్రం ప్రదర్శనలు
- ముగింపురోజు 2 వేల మంది కళాకారులతో బృందనాట్యం
- 50 అడుగుల నాట్య పతాక స్థూపం ఆవిష్కరణ
- దేశ విదేశాల నుంచి రానున్న కళాకారులు

శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలకు కూచిపూడి గ్రామం ముస్తాబైంది. దేశ, విదేశాల నుంచి కళాకారులు రానుండగా, ప్రత్యేక ప్రదర్శనలు రసజ్ఞులను ఆనంద డోలికల్లో ముంచెత్తనున్నాయి.

6లో

వీడిన వివాదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ల్యాంకో టవర్ల మార్పిడి పాత అలైన్‌మెంట్ ప్రకారమే..
- సీఎం నియమించిన ప్రత్యేక కమిటీ నిర్ణయం
- ఫలించిన రైతుల ఉద్యమాలు, ఆంధ్రజ్యోతి కథనాలు
- తాజా నిర్ణయం ద్వారా కేంద్రానికి రూ.100 కోట్ల ఆదా
- దాదాపు 40 ఎకరాల రైతులకు ఊరట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో ల్యాంకో ట్రాన్స్‌మిషన్ విద్యుత్ టవర్ల వివాదం చిక్కుముడి వీడింది. రైతుల పోరాటం, 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణకు ఆదేశించటంతో సమస్య దాదాపు పరిష్కారమైంది. పాత అలైన్‌మెంట్ ప్రకారమే టవర్ల ఎత్తు పెంచి కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వంపై రూ.100 కోట్ల అదనపు భారం తగ్గింది.

సమస్య ఇదీ..

విద్యుత్ టవర్ల రీ లోకేషన్‌కు సంబంధించి గత జూన్ 14న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కీలకమైన ఆదేశాలిచ్చింది. గైడ్‌లైన్-3 ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ విలువ ఎక్కువగా ఉండాలి. మార్కెట్ విలువ ప్రాతిపదికన నష్టపరిహారం చెల్లించాలి. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్స్ వెళ్తున్న ప్రాంతాలైన జక్కంపూడి, నైనవరం ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ ఎకరం రూ.80 లక్షలు ఉంది. కమర్షియల్‌గా చూస్తే రూ.5 కోట్లు ఉంది. ఈ లెక్క ప్రకారం రైతులకు పరిహారాన్ని చెల్లించాలి. గైడ్‌లైన్-4లోని టవర్ బేస్ కాంపన్సేషన్ విషయానికొస్తే.. మార్కెట్ రేటుకు 200 శాతం చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలి. ఈ లెక్కన 41 ఎకరాలకు సంబంధించి రైతులకు రూ.60 కోట్ల మేర పరిహారం ఇవ్వాలి. అలాగే, లైన్లు వెళ్లే పొలాలకు కూడా గైడ్‌లైన్-5 ప్రకారం మార్కెట్ రేటులో 30 శాతం అంటే.. రూ.40 కోట్ల మేర పరిహారం చెల్లించాలి. ఈ రెండూ కలిపితే రూ.100 కోట్ల మేర కేంద్ర ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వాలి. రైతుల ఉద్యమం, 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాల ఫలితంగా రూ.100 కోట్ల మేర కేంద్ర ప్రభుత్వానికి ఆదా అయింది.

రైతులకు వరం

నేషనల్ హైవే ఆర్వో కార్యాలయ అధికారులు అనాలోచితంగా, ల్యాంకో సంస్థ ప్రయోజనాల కోసం రూ.32.58 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. తాజాగా ఈ సమస్యకు పరిష్కారం లభించటంతో ఖర్చుపెట్టగా, మిగిలిన మరో రూ.20 కోట్ల మేర కేంద్రానికి ఆదా అవుతుంది. తాజాగా బీదర్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా జక్కంపూడి, నైనవరం రైతులకు వరంగా మారాయి. బీదర్‌లో ఇలాంటి అంశంపైనే కేసు విచారణకు రాగా, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆదేశాలను పాటించాలని తీర్పు వెలువడింది. ఇదే తీర్పును తాజాగా రైతులు ఏపీ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ కేసుల్లో కోర్టు ఇప్పటికే 11 స్టేలు ఇచ్చింది. తుది తీర్పు రాకముందే సమస్య పరిష్కారం కావటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

రవాణా.. అవినీతి జమానా



రవాణా కార్యాలయం వద్ద వాహనాలు

మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయంలో అక్రమాలు

ప్రతి పనికీ రేటు కట్టి వసూళ్లు

- గ్రీన్‌ట్యాక్స్ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి
- 70 మంది ఏజెంట్లు, ప్రతి ఒక్కరికీ కోడ్ నెంబర్లు
- ఏజెంట్ కోడ్ ఉంటేనే పనిపూర్తి, లేకుంటే ఫైలు పక్కనే..
- వసూళ్లలో ఇన్‌చార్జి అధికారి దూకుడు

మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయంలో అనధికార నగదు వసూళ్ల మోత మోగుతోంది. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి ఇక్కడ నగదు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన రవాణా శాఖ అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవడంతో ఇన్‌చార్జి అధికారి కనుసన్నల్లో ఈ అవినీతి జరుగుతోందనే గుసగుసలు వస్తున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఈ అనధికార వసూళ్లను వేగవంతం చేశారని తెలుస్తోంది. గ్రీన్‌ట్యాక్స్ చెల్లించకుండా చూస్తామంటూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయంలో అనధికార ఏజెంట్లు నగదు వసూలు చేస్తున్నారు. పాత ట్రాక్టర్ ట్రక్కులకు రంగులు వేసి, నూతన ట్రక్కులుగా మార్చి, కొత్త నెంబర్లు ఇచ్చినందుకు ప్రత్యేకంగా నగదు తీసుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందే ఈ అనధికార వసూళ్లను వేగవంతం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి గ్రీన్‌ట్యాక్స్ చెల్లించకుండా చేస్తున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేస్తే వాస్తవాలు బయటకొచ్చే అవకాశాలు ఉన్నాయి.

అవినీతి ఇలా..

రైతులు ట్రాక్టర్ ట్రక్కులను కొత్తవి కొంటే, వాటిని ఎఫ్ఆర్‌లుగా చూపి కొత్త నెంబర్లు ఇవ్వాలి. ఒకసారి రవాణా శాఖ కార్యాలయంలో నమోదైన ట్రాక్టర్ ట్రక్కులకు గ్రీన్‌ట్యాక్స్ రూపంలో మూడు నెలలకోసారి, ఏడాదిలో నాలుగు విడతలుగా ట్రక్కు కొలతలను బట్టి కనీసం రూ.50 వేల నుంచి రూ.70 వేలు చెల్లించాలి. కానీ, ఈ గ్రీన్‌ట్యాక్స్ చెల్లించే విషయంలో రవాణా శాఖ అధికారులు తమ తెలివితేటలన్నీ ఉపయోగిస్తున్నారు. పాత ట్రక్కులకు గ్రీన్‌ట్యాక్స్ లేకుండా చేస్తామంటూ తమ వద్ద ఉన్న ఏజెంట్లతో తెరవెనుక ట్రాక్టర్ యజమానులతో బేరాలాడిస్తున్నారు. ట్రక్కులు తయారు చేసేవారి నుంచి నూతన ట్రక్కు కొనుగోలు చేసినట్లుగా కాగితాలు తెచ్చుకుంటే, వాటిని ఆధారంగా చూపి పాత ట్రక్కులకు కొత్త నెంబర్లు ఇచ్చే పనిని చకాచకా చేసేస్తున్నారు. కొంతకాలంగా మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయం నుంచి 600లకు పైగా పాత ట్రక్కులకు కొత్త నెంబర్లు ఇవ్వడం గమనించదగ్గ అంశం. ఇందుకు సంబంధిత అధికారికి రూ.5 వేలు, ఇతరత్రా ఖర్చుల కింద కొంత నగదు చెల్లిస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతోంది. దీంతో పాతట్రాక్టర్ ట్రక్కులకు చెల్లించాల్సిన గ్రీన్‌ట్యాక్స్ రూపంలో ప్రభుత్వానికి సమకూరాల్సిన ఆదాయానికి పెద్దమొత్తంలో గండిపడుతోంది. పాత ట్రక్కులకు రంగులువేసి వాటిని కొత్తవిగా చూపి, వాటికి కొత్త నెంబర్లు ఇచ్చే పనిని మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయంలో వేగవంతంగా చేస్తున్నారు.

70 మంది ఏజెంట్లు, వారికి కోడ్ నెంబర్లు

మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయ పరిధిలో మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ కార్యాలయంలో వివిధ పనులు చేసేందుకు 70 మంది ఏజెంట్లు ఉన్నారు. వీరంతా కార్యాలయానికి దూరంగా నిలబడి ఉంటారు. లైసెన్సులు, వాహనాల రెన్యువల్స్, టెస్టింగ్. ఇతర పనులకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఈ ఏజెంట్లే చూస్తారు. ఏజెంట్లకు ప్రత్యేక నెంబరుతో కోడ్ ఉంటుంది. కార్యాలయంలోకి వెళ్లే ప్రతి దరఖాస్తుపైన ఏజెంట్ కోడ్ నెంబరును తప్పనిసరిగా వేయాలి. ఈ నెంబరు ఉంటేనే సంబంధిత ఫైలుకు మోక్షం లభిస్తుంది. ఏజెంట్ల ద్వారా కాకుండా ఎవరైనా నేరుగా వివిధ పనుల కోసం దరఖాస్తు చేసుకుంటే, అనేక కొర్రీలు పెట్టి తిరస్కరిస్తారు. ప్రభుత్వానికి చెల్లించే నగదు కాకుండా, అదనంగా ఎల్ఎల్ఆర్‌కు రూ.600, టెస్టింగ్‌కు రూ.1,200 చొప్పున ఏజెంట్లకు అందజేస్తే ఆ పనులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇట్టే అయిపోతాయి.

టిప్పర్లు, లారీల నుంచి నెలవారీ మామూళ్లు

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని ప్రాంతాల్లో టిప్పర్లు, భారీ వాహనాల ద్వారా ఇసుక, బుసక రవాణా నిత్యం జరుగుతూ ఉంటుంది. వీటిలో అనధికారికంగా తిరిగే వాహనాలే అధికంగా ఉంటాయి. ప్రభుత్వానికి ఏమైనా ఫిర్యాదులు అందితే తప్ప, ఈ వాహనాలను అధికారులు తనిఖీ చేయరు. బుసక, ఇసుక అక్రమ రవాణా చేసే వారి నుంచి నెలనెలా మామూళ్ల రూపంలో పెద్దమొత్తంలో నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

అయ్యో పాపం

- చెత్తకుప్పలో పసికందు
- కంచికచర్లలో ఘటన



కంచికచర్ల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాల పెదవుల ఆర్తి ఇంకా తీరలేదు.. అమ్మ పొత్తిళ్లలో వెచ్చదనం పూర్తిగా అందనేలేదు.. ఆ పసికందు కళ్లు తెరవకముందే అనాథగా మారింది. హృదయ విదారకమైన ఈ ఘటన కంచికచర్లలో రాజ్యలక్ష్మి గ్యాస్ కంపెనీ రోడ్డులో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఏ తల్లికి ఏ కష్టం వచ్చిందో తెలియదు కానీ, అప్పుడే పుట్టిన పసిపాపను ముళ్ల పొదల్లో విసిరేసింది. ఈ రోడ్డులో వెళ్తున్న పాదచారులకు పాప ఏడుపులు వినిపించి అక్కున చేర్చుకున్నారు. అప్పటికే చిన్నారి చేతివేళ్లను చీమలు కుట్టేశాయి. తొలుత ఆ పసికందును వైద్యం నిమిత్తం పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ మధురిమ మాట్లాడుతూ పసికందుకు వెంటనే ఆసుపత్రికి తీసుకురావడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. కాగా, మెరుగైన వైద్యం నిమిత్తం పాపను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుప్పకూలిన వంతెన

- ఈదులమద్దాలి వద్ద చంద్రయ్య కాల్వపై ఒక్కసారిగా కూలిన వంతెన
- 10 గ్రామాలకు రాకపోకలు బంద్
- అధికారుల నిర్లక్ష్యమేనన్న గ్రామస్థులు



6లో

పక్కా ప్లాన్‌తో..

బెజవాడలో వార్డు ప్లానర్ల అక్రమాలు

- అనధికార నిర్మాణాల్లో కాసుల వేట
- బీపీఎస్‌ను ఎరగా చూపి వసూళ్లు
- ప్లాన్లు లేకుండా జరిగిపోతున్న నిర్మాణాలు
- వీఎంసీ ఆదాయానికి భారీగా గండి



భవానీపురంలోని మార్బుల్ కాంప్లెక్స్‌లో అనధికారికంగా జరుగుతున్న నిర్మాణాలు

ఓవైపు భవన నిర్మాణాల్లో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామంటూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటనలు చేస్తుంటే, మరోవైపు వార్డు సచివాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీలు భవన అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నారు. వైసీపీ హయాంలో నియమితులైన వీరిని పర్యవేక్షించాల్సిన వీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులు సైతం కాసుల మత్తులో తూగుతుండటంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : భవానీపురంలోని పలు ప్రాంతాల్లో స్థానిక వార్డు ప్లానింగ్ సెక్రటరీల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. 43వ డివిజన్ పరిధిలోని భవానీపురం మార్బుల్ ఎస్టేట్ ప్రాంతంలో ఓ వ్యాపారి సుమారు 3 వేల గజాల ఖాళీస్థలంలో వ్యాపార అవసరాలకు భారీ రేకుల షెడ్డు నిర్మించారు. ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకపోవటంతో తొలుత అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ కొద్దిరోజులకే నిర్మాణ పనులు చేపట్టారు. ఈ షెడ్డు సమీపంలో మరో 600 గజాల స్థలంలో మరో మార్బుల్ వ్యాపారి వీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. 41వ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ (మహ్మదీయ కో ఆపరేటివ్ సొసైటీ ప్లాట్లు)లో భార్యాభర్తలకు వేర్వేరుగా 230 గజాల చొప్పున రెండు ప్లాట్లు ఉన్నాయి. ఈ ప్లాట్లను ప్రతాప్ అనే వ్యక్తి అద్దెకు తీసుకుని అనధికారికంగా భారీ షెడ్డు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లటంతో కార్పొరేషన్ అధికారులు అడ్డుకుని పనులు నిలిపివేశారు. మళ్లీ కొద్దిరోజులకే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేశారు. రెండు ప్లాట్లకు గానూ ఒకే ప్లాన్ తీసుకుని భారీ నిర్మాణం చేపడుతున్నారు. వీటివల్ల కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ వ్యవహారాల్లో ప్లానింగ్ సెక్రటరీలే కీలక పాత్రధారులు. వారి పర్యవేక్షణలోనే ఈ అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి.

వార్డు ప్లానర్లే కీలకం

- 53వ డివిజన్‌లో విధులు నిర్వహించిన వార్డు ప్లానర్ తన అక్రమ సంపాదనతో వన్‌టౌన్ శేషయ్య వీధిలో లక్షలాది రూపాయలతో ఒక ప్లాట్‌ను, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం నులకపేటలో లక్షలాది రూపాయలతో స్థలాలు కొనుగోలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.
- 37వ డివిజన్ పూలబావి వీధిలో 2021లో ఓ వ్యాపారి సుమారు 200 గజాల్లో గ్రౌండ్ ప్లస్ టూ భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత అనధికారికంగా మరో అంతస్తు నిర్మించారు. ఈ డివిజన్ వార్డు ప్లానర్‌గా పనిచేసిన ఉద్యోగి ఆ భవన యజమానిని బెదిరించి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ భవనానికి గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపులు నిర్మించారు. వార్డు ప్లానర్ రివైజ్డ్ ప్లాన్ పెట్టి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న షాపులను పార్కింగ్ ప్రదేశంగా చూపించడం గమనార్హం.
- దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ పాఠశాల వెనుక ఉన్న వీధిలో ఓ వ్యాపారి నిబంధనలకు వ్యతిరేకంగా భారీ భవన నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు రెండు నెలల క్రితం అక్రమంగా నిర్మించిన శ్లాబ్‌కు బెజ్జాలు వేసి పనులు నిలిపివేశారు. అయితే గతంలో ఈ డివిజన్‌లో పనిచేసిన ప్లానింగ్ సెక్రటరీ బిల్డింగ్ యజమాని నుంచి డబ్బు వసూలు చేసి శ్లాబ్ బెజ్జాలను పూడ్చివేసుకోవడానికి అనుమతి ఇప్పించారు.
- 53వ డివిజన్ డ్రైయిన్ వీధిలో ఓ వ్యాపారి సుమారు 200 గజాల ఖాళీ స్థలంలో జీప్లస్‌టూ భవన నిర్మాణం చేపట్టారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్‌లో షట్టర్లు ఏర్పాటుచేసి షాపులు నిర్మించాడు. ఈ వ్యవహారంలో స్థానిక వార్డు ప్లానింగ్ సెక్రటరీ బిల్డింగ్ ఓనర్ నుంచి సుమారు రూ.5 లక్షలు వసూలు చేసినట్లు విమర్శలున్నాయి.

నగ్నదొంగ అరెస్టు

- ఒంటిపై బట్టలు లేకుండా చోరీలు
- ఖాళీ స్థలాల పక్కన ఉన్న ఇళ్లే టార్గెట్
- చోరీల సొమ్ముతో తునిలో భారీ భవన నిర్మాణం
- చాకచక్యంగా పట్టుకున్న విజయవాడ సీసీఎస్ పోలీసులు
- ఎలా పట్టుకున్నారో చెప్పాలంటూ దొంగ వేడుకోలు

8లో

నేటి నుంచి పతాక నాట్యోత్సవాలు

» ముస్తాబైన కూచిపూడి క్షేత్రం



ఆవిష్కరణకు సిద్ధమైన నాట్య పతాక స్థూపం

కూచిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 27 శుక్రవారం నుంచి మూడు రోజులపాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య కళావేదికపై కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలకు నాట్యక్షేత్రమైన కూచిపూడి ముస్తాబైంది. వేడుకల్లో భాగంగా ఉదయం ప్రసంగాలు, సాయంత్రం నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ముగింపు రోజైన ఆదివారం రెండు వేలమంది కళాకారులతో బృంద నాట్యం కూచిపూడి ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ, విదేశాల కళాకారులు ఈ వేదికపై ప్రదర్శన ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా 50 అడుగుల నాట్య పతాక స్థూపాన్ని ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి తెలిపారు.

నభూతో నభవిష్యత్ అనేలా కార్యక్రమాలు

- ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి



నభూతో నభవిష్యత్ అనే విధంగా కార్యక్రమాలు రూపకల్పన చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రాచీన కూచిపూడి సాంప్రదాయ కళలను భావితరాలకు, ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కూచిపూడి ప్రాశస్త్యాన్ని ప్రపంచ నలుమూలల విస్తరించేందుకు అందరి సహకారంతో చేపట్టాం.

కూచిపూడి నాట్యం అజరామరం

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతిబింబించే ప్రాచీన కూచిపూడి నాట్య కళ అజరామరం. మూడు రోజుల కూచిపూడి నాట్యోత్సవ వేడుకల విజయవంతానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది. మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తదితరులు పాల్గొంటారు.

స్వర్ణోత్సవాలకు సర్వం సిద్ధం

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



కూచిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాట్యక్షేత్రమైన కూచిపూడిలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాట్యోత్సవాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులతోపాటు అమెరికా, రష్యా, కెనడా, జపాన్ దేశాలకు చెందిన కళాకారులు తమ నాట్య ప్రదర్శనల ద్వారా సిద్దేంద్ర యోగికి నాట్య నీరాజనాలు అర్పించనున్నట్టు తెలిపారు. కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను కార్మిక శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ తోపాటు పలువురు మంత్రులు, శాసనసభ్యులు ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన, 7 గంటలకు నాట్య శిక్షణా శిబిరం, 9 గంటలకు నాట్య పతాక స్థూప ఆవిష్కరణ, 9.30 నుంచి రాత్రి 11 వరకు నాట్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ముగింపు రోజైన ఆదివారం 2 వేలమంది కళాకారులతో బృంద నాట్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. దేశ విదేశాల నుంచి తరలి వచ్చే కళాకారుల ప్రదర్శనలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మధురానుభూతిని మిగిల్చేలా.. మహాశిల్ప సందర్శన

» స్టీరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ సామాజిక, న్యాయ మహాశిల్ప సందర్శనకు వచ్చేవారికి మరింత మధురానుభూతి మిగిల్చేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి పటిష్ఠ ప్రణాళికతో ప్రతిపాదనల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతి వనానికి సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు, వాహనాల పార్కింగ్ ప్రాంత విస్తరణ, ఫౌంటెయిన్లు, ఆర్వో ప్లాంట్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితరాలతో పాటు సుస్థిర నిర్వహణ పరంగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, మ్యూజికల్ ఫౌంటెయిన్, కుడ్య చిత్రాలు, అంబేడ్కర్ చైత్య ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తదితరాల సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకు సమన్వయ శాఖల అధికారులు ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌పైనా దృష్టిసారించాలన్నారు. డాల్బీ ఆటమ్స్ విహారా మినీ థియేటర్, ప్రదర్శనలు, ఫుడ్‌కోర్టు, వైజ్ఞానిక వినోద కార్యక్రమాల నిర్వహణ తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. జేసీ నిధి మీనా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్డీవో కె.చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శిరోమణి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ, కేపీసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ ప్రతినిధి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి కలిసిరండి..

కృష్ణలంక : ఎన్టీఆర్ జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమంలో హోటళ్ల యజమానులు కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నగరంలోని వివిధ హోటళ్ల యజమానులు, అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించేలా జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకొంటున్నామని, ప్రత్యేక ప్యాకేజీని అమలు చేసేలా ఆలోచన చేస్తున్నామన్నారు. జిల్లాలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. ప్రత్యేక ప్యాకేజీతో ట్యాక్సీ, వాహన యజమానులతో పాటు ఆతిథ్యరంగ అభివృద్ధికీ అవకాశముంటుందన్నారు. దీనికోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్టు కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్పా, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి ఆర్‌వీ స్వామి, వి.రాఘవేంద్ర, హోటల్ ఐలాపురం ప్రతినిధి రాజా, బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గా భక్తి ఛానల్ ప్రారంభం

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానం నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభానికి ముందు ఓ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అశేష భక్తకోటికి కొంగుబంగారం కనకదుర్గమ్మ మహిమలు ఎందరికో అనుభవైకవేద్యమే. దుర్గమ్మ మహిషాసుర సంహారం అనంతరం అదే రూపంలో ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా ఉన్నారని ప్రతీతి. ఈ క్రమంలో అమ్మవారి విశేషాలను ప్రతినిత్యం భక్తజనులకు తెలియపరచటం కోసం ఇప్పటికే పలు ప్రచార మార్గాలు ఉన్నప్పటికీ దేవస్థానం తాజాగా హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ మీడియా సంస్థ సహాయ సహకారాలతో 'కనకదుర్గా భక్తి ఛానల్'ను ప్రారంభిస్తోంది. శుక్రవారం దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఛానల్‌ను ప్రారంభించనున్నారు. కమిషనర్ సత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణ చేయనున్నారు.

సామూహిక రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్)లో భాగంగా ఆకుమర్రు రిజర్వాయర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) కోసం పిలిచిన టెండర్లు అవినీతి కంపు కొడుతున్నాయి. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే ఓఅండ్ఎం స్కీములనూ అవినీతి అధికారులు తమకు భోజ్యంగా ఉపయోగించుకుంటున్నారు. సింగిల్ టెండర్ పడినా.. అర్హతలు లేవని తెలిసినా.. నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టేశారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున చేతులు మారాయన్న తీవ్ర ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి.

ఒక్క బిడ్‌తో.. కట్టబెట్టేశారు!



ఆకుమర్రు రిజర్వాయర్

సీపీడబ్ల్యూఎస్‌లో ఆకుమర్రు రిజర్వాయర్ ఓ అండ్ ఎంకు టెండర్లు!

» అర్హతలు లేకున్నా కొనసాగింపునకు నిర్ణయం
» భారీగా నగదు చేతులు మారినట్టు ఆరోపణలు
» టెండర్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి ఫిర్యాదు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) నేతృత్వంలో మచిలీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని ఆకుమర్రు రిజర్వాయర్ ఓఅండ్ఎం కోసం పిలిచిన టెండర్లలో ఒకే ఒక్క టెండర్ పడింది. అదికూడా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ దానినే కొనసాగించేలా నిర్ణయం తీసుకోవటం వెనుక భారీ ఎత్తున చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- విజయవాడలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంతో పాటు, మచిలీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులకు భారీగా చేతులు తడపటం వల్ల నిబంధనలకు విరుద్ధమైనా టెండర్ కట్టబెట్టేశారని తెలుస్తోంది. గతంలో వైసీపీలో క్రియాశీలకంగా ఉన్న వ్యక్తికి టెండర్‌ను కట్టబెట్టడం ఇంకా విమర్శలకు తావిస్తోంది. ఈ టెండర్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై ఆయన విచారణకు ఆదేశించాల్సి ఉంది.
- మచిలీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని ఆకుమర్రు గ్రామంతో పాటు మరో 52 హ్యాబిటేషన్స్‌కు రక్షిత మంచి నీటిని అందించేందుకు స్థానిక రిజర్వాయర్ నిర్వహణ కోసం ఈ నెలలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెండర్లు పిలిచారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఆఖరు వరకు ఏడాది కాలానికి టెండర్లు పిలుస్తారు. సవరించిన అంచనాల ప్రకారం ఏడాదికి రూ.1.99 కోట్లు విలువతో ఈ టెండర్‌ను పిలవాల్సి ఉండగా.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మూడునెలల కాలానికి అంటే మార్చి వరకు నిర్వహణకు గాను రూ.60 లక్షలకు టెండర్లు పిలిచారు. మార్చి తర్వాత తిరిగి జడ్పీ అప్రూవల్ తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో అమలవుతున్న ఓఅండ్ఎం స్కీమ్‌లను పరిశీలిస్తే.. మళ్లీ డిసెంబరులో తప్పితే సాధారణంగా జడ్పీ అనుమతులు ఇవ్వటం లేదు. అప్పటి వరకు ఉన్న సంస్థలనే కొనసాగించే పరిస్థితి. అంటే ప్రస్తుతం మూడు నెలలకు పిలిస్తే.. అనుకోకుండా అదే కాంట్రాక్టర్‌ను మరికొంత కాలం కొనసాగిస్తారు.



వైసీపీ వీర విధేయుడికే టెండర్

గతంలో వైసీపీ వీరవిధేయుడిగా ఉన్న ఓ కాంట్రాక్టర్ ఈ ఓఅండ్ఎం కోసం టెండరు వేయగా ఆ ఒక్క టెండర్ మాత్రమే పడింది. సహజంగా సింగిల్ టెండర్ పడితే.. దానిని రద్దుచేసి పోటీ పెంచటానికి మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈపని చేయలేదు. దీంతో పాటు టెండరు నిబంధనల ప్రకారం అనుభవం లేకున్నా కట్టబెట్టడం విశేషం.

నిబంధనలు బేఖాతరు

టెండరు నిబంధనల ప్రకారం ఆకుమర్రు రిజర్వాయర్ ఓఅండ్ఎం కోసం 3,74,821.13 కేఎల్ పరిమాణాన్ని నిర్వహించగలిగిన అనుభవం ఉండాలి. కానీ టెండరు వేసిన వైసీపీ వీరవిధేయుడికి 3,28,258.44 కేఎల్ పరిమాణం నిర్వహణ చేపట్టగలిగిన అనుభవం మాత్రమే ఉంది. కాబట్టి వెంటనే టెండర్‌ను రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలి. కానీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏకంగా టెండర్‌ను కట్టబెట్టేశారు.

కొందరు అవినీతి అధికారుల హస్తం!

విజయవాడలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలోని కొందరు అధికారుల హస్తంతో టెండర్‌ను ఆమోదించినట్టుగా తెలుస్తోంది. భారీఎత్తున చేతులు మారటం వల్లనే ఈ టెండర్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి టెండర్లలో పోటీ ఉంటే.. ఆకుమర్రు ఓ అండ్ఎం నిర్వహణకు 50 శాతం వరకు లెస్ టెండర్లు పడి ఉండేవి. ఎవరినీ ఈ టెండర్లలో పాల్గొనకుండా అధికారులు మేనేజ్ చేశారన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ పడినా అదే కాంట్రాక్టర్‌తో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అగ్రిమెంట్ చేసుకోవటం గమనార్హం.

చివరి గింజ కొనేవరకు అప్రమత్తం

» రైతులను చేయిపట్టి నడిపించండి
» ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలి
» నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంగా పనిచేయండి
» సమీక్షా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో జేసీ నిధి మీనా, ఆర్డీవో తదితరులు

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి రైతు సేవాకేంద్రాల పరిధిలో ఇప్పటివరకు రూ.178.39 కోట్ల విలువైన 77,440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 11,730 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. చివరిగింజ కొనుగోలు వరకు అత్యంత అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ పౌర సరఫరాలు, వ్యవసాయం, మార్కెటింగ్, సహకార తదితరశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం, రైతుల ఖాతాల్లో జమచేసిన సొమ్ము, గోనెసంచుల అందుబాటు, మిల్లులకు ధాన్యం రవాణా, వర్షాల నేపథ్యంలో తీసుకున్న ప్రత్యేక చర్యలు తదితరాలపై చర్చించారు. ఏ ఒక్క రైతుకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు హితమే లక్ష్యంగా సమన్వయ శాఖల అధికారులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందించాలని స్పష్టం చేశారు. కోతలు చివరి దశలో ఉన్నందున ఆయా రైతులతో క్షేత్రస్థాయిలో మండల, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొంటూ పనిచేయాలన్నారు. తేమశాతం, మద్దతు ధర, గన్నీలు, రవాణా సౌకర్యం ప్రతి అంశాన్ని క్షుణంగా వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి వీఐఆర్ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకొంటోందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంతృప్తి విషయంలో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని అందుబాటులో ఉన్న టార్పాలిన్ల సంఖ్యను పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పక్కదారి పడితే సహించేది లేదు..

ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు సంబంధించి ఒక్క బియ్యపు గింజ పక్కదారి పట్టినా సహించేది లేదని, పేదల బియ్యం పక్కదారి పట్టకుండా క్షేత్రస్థాయి అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కస్టమ్ మిల్లెడ్ రైస్ (సీఎంఆర్) కలర్ పరీక్షలపై దృష్టిసారించాలని, పరీక్ష ఫలితాలను డాక్యుమెంట్ చేయాలని ఆదేశించారు. తహసీల్దారు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు మిల్లులు, పీడీఎస్ దుకాణాలు, ఎండీయూ వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీచేసి, నివేదికలు సమర్పించాలన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై కేసుల నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆహార భద్రత కల్పించడంలో అత్యంత కీలకమైన పౌర సరఫరాల వ్యవస్థలో ఏ చిన్న అవకతవకలకు ఆస్కారం లేకుండా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.శ్రీనివాస్, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ టెక్నికల్ అధికారి ఎం.స్వప్న, జిల్లా కో-ఆర్డినేటర్ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, మార్కెటింగ్ ఏడీ కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం నిల్వలపై పటిష్ఠ నిఘా

» బఫర్ గోదాముకు ఇన్‌చార్జిగా డిప్యూటీ తహసీల్దార్

కృష్ణలంక : పేదల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా అమలవుతున్న పీడీఎస్ బియ్యంలో ఒక్క గింజ పక్కదారి పట్టినా సహించేదిలేదని, పేదల బియ్యం దారిమళ్లకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అవకతవకలకు చెక్ పెట్టేందుకు సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యుసీ) బఫర్ గోదాముకు డిప్యూటీ తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించేందుకు ఆదేశాలు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. రూరల్ మండలం, పూడూరుపాడులో గల



గోదాములో బియ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం తేమశాతం నమోదు ప్రక్రియను పరిశీలించడంతో పాటు రైతులతో మాట్లాడారు. రాయనపాడులోని సీడబ్ల్యూసీ గోదామును పరిశీలించారు. కస్టమ్ మిల్లోడ్ రైస్ (సీఎంఆర్)లో పీడీఎస్ బియ్యం కలిశాయా? నిర్దేశ ప్రమాణాల ప్రకారమే మిల్లులు సీఎంఆర్ కింద బియ్యం ఇస్తున్నాయా లేదా? అనేదానిని నిర్ధారించేలా పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు తదితరులు వున్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ రేపు

మచిలీపట్నం టౌన్ : విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ మునిసిపాలిటీల పరిధిలో ఖాళీగా ఉన్న 30 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. ఇందుకు గాను 28న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు,సర్వీసు రిజిష్టర్లతో హాజరుకావాలన్నారు.

కళ్లజోళ్ల పంపిణీకి దరఖాస్తులు

పాఠశాలల్లో విద్యార్థులు కళ్లజోళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.శర్మిష్ఠ పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా ఈకార్యక్రమం చేపడుతున్నామన్నారు.

దేశం కోసం వీరుల ప్రాణ త్యాగం

» ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సిక్కుల గురువు గురుగోవింద్‌సింగ్ కుమారులైన జోరావర్‌సింగ్, ఫతేసింగ్‌లు భరతమాత కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా వీరమరణం పొందారని, వారి దేశభక్తి అందరికీ ఆదర్శమని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. చిలకలపూడి ఏపీ రెసిడెన్షియల్ మైనారిటీ బాలుర హాస్టల్‌లో గురువారం వీర్‌బాల్‌దివస్ జరిగింది. ముడా చైర్మన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం గజేంద్రరావు తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అంతర్జాతీయ చెస్ క్రీడాకారులకు సత్కారం



రేటెడ్ ప్లేయర్స్‌తో గ్లోబల్ చెస్ అకాడమీ కోచ్, అతిథులు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నవీన క్రీడా ఉత్సవ్‌లో భాగంగా ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ టోర్నీలో గ్లోబల్ చెస్ అకాడమీ ప్లేయర్స్ రేటింగ్ సాధించారు. ఈ సందర్భంగా వారిని గురువారం ఘనంగా సత్కరించారు. క్లాసిక్‌లో మహీధర్ 1517, ర్యాపిడ్‌లో 1540, బ్లిజ్‌లో 1433తోను, అర్షద్‌బాబా రాపిడ్‌లో 1515, బ్లిజ్‌లో 1492, గీత శ్రీకృష్ణ చైతన్యకు ర్యాపిడ్‌లో 1461, షేక్ నబీహాకు రాపిడ్‌లో 1458, దుల్కర్ అహ్మద్‌ఖాన్‌కు బ్లిజ్‌లో 1505, చరణ్ సోమేశ్వర్‌కు బ్లిజ్‌లో 1505, అక్షర మాచర్లకు 1437 స్టాండర్డ్‌లో సాధించారు. అభినందన కార్యక్రమంలో గ్లోబల్ చెస్ అకాడమీ చెస్ కోచ్ షేక్ ఖాసీమ్, ఐకాన్ పబ్లిక్ స్కూల్ అకాడమి డైరెక్టర్ కె.రాజేంద్ర, ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

శిరసావహించాల్సిందే..

(5వ పేజీ తరువాయి)

కొద్దిరోజులుగా రోజుకు 1,000 దాటి కేసులు నమోదవుతున్నాయి. జరిమానాలు రూ.లక్షల్లో చెల్లిస్తున్నారు. మార్పు రావాలంటే వాహనాలను సీజ్ చేయడమే మార్గమని పోలీసులు భావించారు. అయినా మార్పు రాకపోతే లైసెన్సులవైపు చూడాలని భావిస్తున్నట్టు సమాచారం. మూడు చలానాలకు మించి ఉంటే డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయించాలని చూస్తున్నారు. ఈ మేరకు రవాణా శాఖాధికారికి లేఖ రాయనున్నారు.

మూడు నెలల్లోపు చలానా చెల్లించాల్సిందే..

- ఏవీఎల్ ప్రసన్నకుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

ఒకసారి ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించాక దాన్ని మూడు నెలల్లోపు చెల్లించాలి. లేనిపక్షంలో కచ్చితంగా వాహనాన్ని సీజ్ చేస్తాం. మేం ఇంతకుముందు జరిమానాలు విధించినా ఇప్పటి వరకు చెల్లించని వాహనాలున్నాయి. వాహనాదారులు మాకు ఇంకా సమయం ఉందని సమాధానం చెబుతున్నారు. ఇది సరికాదు. మేం విధించిన చలానాను 90 రోజుల్లో చెల్లించకపోయినా, ఈలోపు కొత్త జరిమానాలు విధించినా కచ్చితంగా వాహనాన్ని సీజ్ చేస్తాం.



చంద్రయ్య కాలువపై కూలిపోయిన వంతెన

కుప్ప కూలిన వంతెన!

» 10 గ్రామాలకు రాకపోకలు బంద్
» అధికారుల నిర్లక్ష్యమే అంటున్న గ్రామస్థులు



ఇరుక్కుపోయిన ట్రాక్టర్ ట్రక్కు

పెదపారుపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈదులమద్దాలి శివారులోని చంద్రయ్య కాలువపై వంతెన గురువారం కూలిపోయింది. దీంతో పెదపారుపూడి నుంచి యలమర్రు మీదుగా విజయవాడ వెళ్లే మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సమయంలో వంతెనపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కు అందులో ఇరుక్కుపోయింది. గత రెండేళ్లుగా వంతెన దుస్థితిపై ప్రజలు ఆందోళన చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించారని, కేవలం వారి నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి వచ్చిందని వాహనదారులు వాపోతున్నారు.

గుడివాడ-కంకిపాడు రహదారి అధ్వానంగా ఉండటంతో విజయవాడకు ప్రయాణికులు ఈ మార్గంలోనే వెళుతుంటారు. చుట్టుపక్కల సుమారు 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు ఈ మార్గం ద్వారానే గుడివాడకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. రైతులకు సైతం ప్రధాన రహదారిగా ఉంది. వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండటంతో పలువురు రైతులు ఏడాది క్రితం నాలుగు చక్రాల వాహనాలు రాకుండా మట్టి దిబ్బలను పోసి ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా జాగ్రత్తలు చేపట్టారు. కాలక్రమేణా మట్టి కరిగిపోగా చివరకు వంతెన కూలిపోయింది. అధికారులు స్పందించి రాకపోకలకు మార్గం ఏర్పాటు చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. వంతెన కూలిన విషయాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకెళ్లినట్టు ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే గతంలోనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, రూ.1.50 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఆర్ అండ్ బీ అధికారులు కూలిన వంతెనను పరిశీలించినట్టు ఆమె తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113,121, 132
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకుని భూ సంబంధిత, ఇతర సమస్యలు పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి వీవీ ఫణికుమార్ అన్నారు. ఆకునూరులో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివరామ ప్రసాద్, తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్, సర్పంచ్ గోలి వసంత కుమార్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సురేశ్‌కుమార్

రూ.లక్ష విరాళం

ఉంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం, పురుషోత్తపట్నం శివారులో నూతనంగా నిర్మిస్తున్న భక్త మార్కండేయ సామాజిక భవనానికి విజయవాడకు చెందిన తేలు కృష్ణ దంపతులు, శివక్రాంతి వరప్రసాద్ దంపతులు సంయుక్తంగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. తన మనవడు తేలు శివ అభినవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబసభ్యులంతా కలిసి సామాజిక భవన నిర్మాణ బాధ్యులకు రూ.లక్ష చెక్కు అందజేసినట్లు తాత తేలు కృష్ణ తెలిపారు. ఈ మేరకు భవన నిర్మాణ బాధ్యులు మాజీ వైస్ ఎంపీపీ సామల ఆంజనేయులు, దామర్ల నారదమునియ్య, కౌతరపు రామకృష్ణ, నందం బుజ్జిబాబు తదితరులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ కుల గణనపై సోషల్ ఆడిట్

ఉయ్యూరు : మండల పరిధి గ్రామాల్లో ఎస్సీ కుల గణన వివరాలపై సోషల్ ఆడిట్ నిమిత్తం గ్రామపంచాయతీ వద్ద నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్టు ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు తెలిపారు. కడవకొల్లు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద దీనికి సంబంధించి జాబితాను గురువారం నోటీస్ బోర్డులో ఉంచారు. ఈనెల 31 లోగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని తెలిపారు.

అడవిని తలపిస్తున్న శ్మశానవాటికలు

● కనీస వసతుల కల్పనపై దృష్టిసారించని గత ప్రభుత్వ పాలకులు ● అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజల అవస్థలు

హిందూ, ఎస్సీ శ్మశానవాటికలు గత కొన్నేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక చెట్లు చేమలతో అధ్వానంగా మారాయి. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

(ఉంగుటూరు- ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నారయ్య అప్పారావుపేటలో హిందూ, ఎస్సీ శ్మశానవాటికలు గత కొన్నేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక చెట్లు చేమలతో అధ్వానంగా మారాయి. దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లచెట్లతో అవి అడవిని తలపిస్తున్నాయి. దీంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజల ఆందోళనలతో గత ఏడాది ఉపాధిహామీ పథకం కింద ఆయా శ్మశానవాటికల్లో తూతూమంత్రంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. వర్షాలకు రెండు శ్మశానవాటికల్లో తుమ్మ ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి శ్మశానవాటికల లోపలకు వెళ్లే మార్గాన్ని కూడా కమ్మేశాయి. దీంతో గుబురు ముళ్లపొదలు, తుప్పలలో మనిషి నడవటానికి కూడా దారిలేకపోవడంతో మృతదేహాలకు రోడ్డు మార్జిన్‌లోనే అంతిమ సంస్కారాదులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గ్రామంలో సుమారు 3.25సెంట్లలో ఎస్సీ శ్మశానవాటిక, 10సెంట్ల స్థలంలో హిందూ శ్మశానవాటికలు వున్నాయి. ఎస్సీ శ్మశానవాటిక గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే వుండగా, గ్రామానికి సుమారు కిలోమీటరు మేర దూరంలో గుంతలు పడి బురదమయమైన డొంకరోడ్డులో హిందూ శ్మశానవాటిక వుంది. చినుకుపడితేచాలు మృతదేహాన్ని హిందూ శ్మశానవాటికకు మోసుకెళ్లాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా హిందూ శ్మశానవాటికకు స్థలం కూడా సరిపోవటంలేదని, ఒకరి శవాన్ని పూడ్చిన గుంతలోనే మరొకరి మృతదేహాన్ని ఖననం చేయాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వున్న స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని లేకుంటే ఆ స్థలం కూడా మిగిలే పరిస్థితి లేదంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల శ్మశానవాటికల్లో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నాయకులైనా రెండు శ్మశానవాటికల్లో నీటి సౌకర్యం, చుట్టూ ఫెన్సింగ్, విశ్రాంతి మందిరాల నిర్మాణం వంటి కనీస వసతులు కల్పించడంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.





తుమ్మముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్న హిందూ, ఎస్సీ శ్మశానవాటికలు

హైందవ శంఖారావం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ఉంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో జరుగనున్న హైందవ శంఖారావం బహిరంగసభలో హైందవులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి పిలుపునిచ్చారు. గురువారం హైందవ శంఖారావం జరిగే ప్రదేశాన్ని సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఈసభకు వివిధ ప్రాంతాలనుంచి సుమారు 2లక్షలకు పైగా ప్రజలు పలు వాహనాల్లో తరలివచ్చే అవకాశమున్నందున పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా, ప్రజల వసతి సదుపాయాల కల్పనలో సమస్యలు తలెత్తకుండా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మరో రెండురోజుల్లో సభాస్థలికి సంబంధించిన పనులు ఒక కొలిక్కి వచ్చే అవకాశముందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీహెచ్‌పీ నేతలు రవికుమార్, వెంకటశివనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నేతలను అభినందిస్తున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంకిపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ హయాంలో ప్రజలు నరకాన్ని చవిచూసారని మాజీ ఎంపీపీ దేవినేని రాజా విమర్శించారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను సర్పంచ్ పందిపాటి ఇందిరతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పక్కన పెడితే రోడ్డు ప్యాచ్ వర్కులు కూడా చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో రూ. 54 కోట్లతో రహదారి, డ్రెయినేజీ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, గ్రామస్థులు శ్రీను, సురేష్, బ్రహ్మాజ, శ్రీకాంత్, జామువ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా

కోస్టల్ బ్యాంక్‌లో ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోస్టల్ బ్యాంక్ గన్నవరం బ్రాంచ్ 25వ వార్షికోత్సవం సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎస్.హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విజయవాడ సెంటినీ హాస్పటల్, మౌత్‌కేర్ సొల్యూషన్ క్లినిక్ సంయుక్తంగా స్థానిక కోస్టల్ బ్యాంక్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ కంటి, దంత వైద్యనిపుణులు డాక్టర్ ఎం.నారాయణ, డాక్టర్ మాధురి నేతృత్వంలో వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 200మందికి ఉచితంగా వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశామన్నారు. శుక్రవారం బ్యాంక్ కస్టమర్లకు మీటింగ్ ఏర్పాటుచేసి బ్యాంక్ సంబంధిత ఖాతాలు, డిపాజిట్లు, లావాదేవీలపై అవగాహన కల్పించి నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మౌత్‌కేర్ సొల్యూషన్ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్‌కుమార్, బ్యాంక్ కస్టమర్లు, స్థానికులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, బ్యాంక్ అధికారులు

విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపొద్దు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు బిగించనీయమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వమే షాపులు, సంస్థలకు బిగిస్తూ ఖర్చును ప్రజలపై వేస్తున్నారని, వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి పనిచేస్తున్న మీటర్ల స్థానే స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపడమేనని సీపీఎం నాయకుడు బేతా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లవల్లి, బండారుగూడెం గ్రామాల్లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో అదానీ, పాలకుల అవినీతికి ప్రజలపై విద్యుత్ భారం వేస్తారా... అని ప్రశ్నిస్తూ వేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. అందుకే పార్టీలకతీతంగా ప్రజలందరూ ఏకమై స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైతు సంఘ నాయకుడు సాంబశివరావు, మధు, బర్రె లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

ఉచితంగా డ్రింకర్ సాయి ప్రదర్శన

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎస్ టాకీస్‌లో యువ కథానాయకుడు కాకాని ధర్మ మహేష్ నటించిన డ్రింకర్ సాయి సినిమాను గురువారం మ్యాట్నీ షో(ప్రీ బెనిఫిట్) ఉచితంగా ప్రదర్శించారు. జంక్షన్ కేఎస్ టాకీస్ థియేటర్ యజమాని కాకాని బాబు కుమారుడు ధర్మమహేష్ నటించిన ద్వితీయ చిత్రం డ్రింకర్ సాయి చిత్రం గురువారం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్న సందర్భంగా అభిమాన ప్రేక్షకుల కోసం మ్యాట్నీ షో వేశారు. ఈ చిత్రాన్ని గురువారం నుంచి నాలుగు షోలు ఉచితంగానే ప్రదర్శిస్తున్నట్లు థియేటర్ యాజమాని కాకానిబాబు తెలిపారు. హీరో తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులతో పాటు చిత్ర దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి, ఇతర సాంకేతిక నిపుణులు ప్రేక్షకుల మధ్య కూర్చుని చూశారు. సినిమాలో యూత్‌కు మంచి సందేశంతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

అంధకారంలో హైవే, అండర్‌పాస్‌లు

ఉయ్యూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై రోజుల తరబడి వీధిలైట్లు వెలగక చిమ్మచీకట్లు అలుముకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై కంకిపాడు మండలం నుంచి పామర్రు మండలం వరకు పొడవునా లైట్లు వెలగక స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారిపై కంకిపాడు, ఆకునూరు, ఉయ్యూరు, మంటాడ, తాడంకి, కురుమద్దాలి, పామర్రు వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్ల వెంబడి కూడా రోజుల తరబడి లైట్లు వెలగక పోవడంతో పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కార్లు ఇతర వాహనాల నుంచి ముక్కుపిండి టోల్‌గేట్ వసూలు చేసే హైవే అథారిటీ రోడ్లు, లైట్ల నిర్వహణ పట్టించుకోపోవడం పట్ల ప్రజల్లో సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి హైవేపైన, సర్వీస్ రోడ్ల వెంబడి, అండర్ పాస్‌ల్లో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అంధకారంలో హైవే, అండర్‌పాస్‌లు



సభ్యత్వ నమోదు చేస్తున్న కార్యకర్తలు

టీడీపీ సభ్యత్వ నమోదు

పెనమలూరు : కానూరు 38వ డిజన్ పెద్ద బావి సెంటర్‌లో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరిగింది. 38వ డివిజన్ అధ్యక్షుడు మాదు రామకృష్ణ, ముదిగొండ అంకాలు, మాదు నాగార్జున, కోటేశ్వరరావులు సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

పిల్లలతో తల్లి అదృశ్యం

ఆటోనగర్: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. డి.నాగారాజు మట్టి పని చేసుకుంటు కటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లిన నాగరాజు సాయంత్రం తిరిగి ఇంటికి రాగా భార్య (26), ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ వి. పవన్ కిషోర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరిలో సమ్మెబాట పడతామని పెనమలూరు మండల సీఐటీయు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు అన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను గురువారం కలసి కార్మిక సమస్యలపై వినతిపత్రం అందచేశారు. సీఐటీయూ నాయకులు మస్తాన్ వలి, వై. సరళ, రత్నకర్ణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ

హనుమాన్ జంక్షన్: స్థానిక బాపులపాడు గ్రామంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం భూమిపూజ నిర్వహించారు. ఫిబ్రవరి 2న ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, దేవతా విగ్రహాలు ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్, రాధా



కోడూరుపాడులో నివాళులర్పిస్తున్న నేతలు



కొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న రమేష్‌బాబు



పండ్లు పంపిణీ చేస్తున్న యార్లగడ్డ

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రసాదంపాడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీన వర్గాల కోసం పోరాటలు చేసిన మహనీయుడు వంగవీటి రంగా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం రామవరప్పాడులో వంగవీటి రంగా 36వ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని అంకిత అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. పేదలకు, వృద్ధులకు, పండ్లు పంపిణీ చేశారు.

జగన్ ప్రజాదర్బార్‌పై యార్లగడ్డ నిప్పులు

అనంతరం ఓ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ జగన్ ప్రజాదర్బార్‌పై నిప్పులు చెరిగారు. ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన వేదిక అసెంబ్లీ అని, ముఖ్యమంత్రి చంద్రబాబును చూసే ధైర్యం లేక పులివెందుల ఎమ్మెల్యే జగన్ అసెంబ్లీకి రావడం లేదని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు జగన్ ప్రజాదర్బార్ నిర్వహించడం హాస్యాస్పదమని, ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను జగన్ సొంత నిధులతో పరిష్కరిస్తారా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకపోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని, శాసనసభను అవమానించడమేనన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, జగన్ తీరుతో వారి పార్టీ సభ్యులు కూడా బాధపడుతున్నారన్నారు. 11 మంది శాసనసభ్యులు ఉంటే ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వలేదని యార్లగడ్డ వ్యాఖ్యానించారు.

ఉయ్యూరు: పేదల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న మహనాయకుడు వంగవీటి మోహన రంగా అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రంగా 36వ వర్ధంతి పురస్కరించుకుని గురువారం ఉయ్యూరులో పలుచోట్ల ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఫ్లోరాస్కూల్ వంతెన, బస్‌స్టాండ్ సెంటర్, కాపుల రామాలయం వద్ద రంగా విగ్రహానికి, ప్రధానసెంటర్‌లో రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉయ్యూరు చైర్మన్ సత్యనారాయణ, వాసు, దండమూడి చౌదరి, శ్రీనివాసప్రసాద్, మహాలక్ష్మి, పాల్గొన్నారు.

కంకిపాడు: తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన వంగవీటి మోహన్ రంగా వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకర్, చెన్నుపాటి శ్రీను, వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, పచ్చిపాల రాజ, జనసేన నాయకులు నాగరాజు, సుంకర సురేష్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో రక్త దానం

జనసేన పార్టీ నాయకురాలు, సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయిన రోహిణీ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ముప్పా రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుంకర శివ, టి. సూర్యప్రకాష్, బోయిన నాగరాజు, నూతక్కి శేషు, జె. వీరాస్వామి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కోడూరుపాడు, కొత్తపల్లి, రేమల్లె గ్రామాల్లో జనసేన, టీడీపీ నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోడూరుపాడులో టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్న, చందు సందీప్, గరికపాటి నాగేశ్వరరావు, ఆళ్ల బాలకృష్ణ, నరహరశెట్టి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లిలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో విగ్రహానికి నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తమలం ఝాన్సీరాణి, డీసీసీ కార్యదర్శి నండూరి శ్రీనివాసరావులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగా విగ్రహాల ఆవిష్కరణ

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురు, తాడగడప క్లస్టర్లలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా విగ్రహాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, రంగా తనయుడు వంగవీటి రాధాలు ఆవిష్కరించారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. రంగా అభిమానులు, కూటమి నాయకులు, శ్రేణులు తరలివచ్చారు.

30, 31, జనవరి 2న దుర్గమ్మ కానుకల లెక్కింపు

వన్‌టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 30, 31, జనవరి 2వ తేదీన హుండీ కానుకల లెక్కింపు జరపనున్నట్లు ఈవో కె.ఎస్.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను మహా మండపంలోని 6వ అంతస్థులో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. తగిన బందోబస్తు మధ్య దేవదాయ శాఖ అధికారులు, దేవస్థానం సిబ్బంది, అమ్మవారి సేవాదారులు ముందస్తు అనుమతి తీసుకుని లెక్కింపునకు రావాల్సి ఉంటుందని తెలిపారు. సాంప్రదాయ దుస్తులను ధరించి లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

'ఆర్టీసీ అప్రెంటిస్' ధ్రువపత్రాల పరిశీలన షెడ్యూల్ విడుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్‌నకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల పరిశీలన నిమిత్తం అధికారులు షెడ్యూల్‌ను ప్రకటించారు. నవంబరు 6వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలిస్తామని జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ వి.నీలిమ గురువారం తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని డాక్యుమెంట్స్ సరిగా అప్‌లోడ్ చేయని వారు డిసెంబరు 28వ తేదీన ఆర్టీసీ వెబ్‌సైట్‌లో లిస్ట్‌లో పెట్టిన వారు మాత్రమే అదే రోజున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ/స్పోర్ట్స్, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలు ఎవరైనా ఉంటే వారు డిసెంబరు 31వ తేదీన వెరిఫికేషన్‌కు రావాల్సి ఉందని తెలిపారు. మోటార్ మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, పెయింటర్, మెచినిస్ట్ ట్రేడ్స్‌కు సంబంధించిన వారు జనవరి 2న వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్స్‌కు చెందిన వారు జనవరి 3న, డీజిల్ మెకానిక్ ట్రేడ్స్‌కు చెందిన వారు జనవరి 4, 6 తేదీలలో వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

బందరులో విగ్రహాలు ధ్వంసం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బందరు కోటలోని మారుతి స్వామి ఆలయంలో శివలింగం, వినాయకుడు, కుమారస్వామి విగ్రహాలను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం గమనించిన ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్ తదితరులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు దీనిపై విచారణ ప్రారంభించారు.

జనవరి 2, 3, 4 తేదీల్లో రేషన్‌షాపు నిర్వాహకులకు ఇంటర్వ్యూలు

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : విజయవాడ డివిజన్ పరిధిలోని విజయవాడ సర్కిల్ 1,2,3, ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు మండలాల్లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల డీలర్ల నియామకంపై ఇంటర్వ్యూలు జనవరి 2,3,4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పై ప్రాంతాలలో రేషన్ దుకాణాల డీలర్ నియామకానికి నిర్వహించు రాత పరీక్ష డిసెంబరు 22న చిట్టినగర్‌లోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్ర, శనివారాల్లో నిర్వహించాల్సి ఇంటర్వ్యూలను 2025 జనవరి 2, 3, 4 తేదీలకు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులు పైతెలిపిన తేదీలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

విజయవాడ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్తున్న బస్సులు ఆగేది అక్కడే. ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు వచ్చే బస్సులు మలుపు తిరిగేది ఇక్కడే. జాతీయ రహదారికి ఇవతలి వైపు నుంచి అవతలి వైపునకు తిరిగే మలుపూ ఇదే. ఒకే వైపునకు మూడు విభిన్న పరిస్థితులు ఉన్న ప్రదేశమది. అదే వారధికి దిగువన ఉన్న ధర్మచక్రం కూడలి. విజయవాడలో ఇబ్రహీంపట్నం తర్వాత అతిపెద్ద కూడలి ఇదే. ఇక్కడంతా గందరగోళమే. వచ్చేపోయే బస్సులను ఎక్కడ ఆపాలన్న దానిపై ఒక స్పష్టత లేకపోవడం, సరిగ్గా మలుపుల వద్దే బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయడం, మలుపుల వరకు ఐలాండ్‌లు ఉండడంతో ఇక్కడ పరిస్థితి అంతా తికమకగా, ప్రమాదకరంగా ఉంటుంది. దీనికి పరిష్కారం చూపించడానికి కొత్త ప్రతిపాదనలను ట్రాఫిక్ పోలీసులు సిద్ధం చేస్తున్నారు.



విజయవాడలోని వారధి 'ధర్మచక్రం' వద్ద ట్రాఫిక్ రద్దీ

ట్రాఫిక్ చక్రవ్యూహం

- వారధి 'ధర్మచక్రం' వద్ద మూడు మలుపులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- గుంటూరు వైపు బస్టాండ్ మార్పుపై సమాలోచనలు

● బందరు కాల్వ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బస్‌బే ఏర్పాటు ● ఇరిగేషన్, ఆర్టీసీ, వీఎంసీ సమన్వయమే ముఖ్యఘట్టం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లే బస్సులు కృష్ణలంక ఆర్వోబీపై నుంచి వచ్చి వారధికి దిగువ ఉన్న ఐలాండ్ కూడలి వద్ద మలుపు తీసుకుని గుంటూరు వైపు రహదారిపైకి ప్రవేశిస్తాయి. ఆర్టీసీ అధికారులు సరిగ్గా ఈ ప్రదేశంలోనే బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లాల్సి ప్రయాణికులు ఇక్కడ వేచి ఉంటున్నారు. మొత్తం ఇక్కడ మూడు మలుపులు ఉన్నాయి. రాణిగారితోట వైపు నుంచి పశువుల ఆస్పత్రి వీధిలోకి వెళ్లాల్సిన వాహనదారులు వారధి కింద మొదటి మలుపులోకి తిరగాల్సి ఉంటుంది. రెండో మలుపు నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాల వైపు వెళ్లే బస్సులు వస్తాయి. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి పీఎన్‌బీఎస్‌కు వచ్చే బస్సులు మూడో మలుపు నుంచి వెళ్తాయి. పీఎన్‌బీఎస్ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాకు వెళ్లే బస్సులను ఇక్కడ ఉన్న స్టాప్ వద్ద ఆపుతున్నారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు, ఆటోలే కాకుండా కొన్ని లారీలు, ఇతర కంటైనర్లు రావడంతో మొత్తం రహదారి స్తంభించిపోతోంది. ఫలితంగా మొదటి



వారధి వద్ద గుంటూరు వైపు ఉన్న బస్ షెల్టర్

మలుపు నుంచి పశువుల ఆస్పత్రి రోడ్డులోకి వెళ్లాల్సిన వాహనదారులు రూటు తప్పుతున్నారు. వారధికి అందాలను అద్దడానికి ఇక్కడ విశాల ప్రదేశంలో భారీ ఐలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు మలుపులను వేరు చేసేలా ఐలాండ్ నిర్మించారు. దీనివల్ల ఈ కూడలిలో ఉన్న రహదారులు ఇరుకుగా మారాయి. ఏకకాలంలో రెండు బస్సులు పక్కపక్కన వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది.

ఇలా చేస్తే మేలు..

జాతీయ రహదారి వెంబడి నగరం మధ్య నుంచి బందరు కాల్వ ప్రవహిస్తోంది. దీనికి పక్కనే ఖాళీ స్థలం ఉంది. ఈ ప్రదేశాన్ని జనం డంపింగ్ యార్డుగా మార్చకుండా చేసేందుకు జాతీయ రహదారి పొడవున వీఎంసీ ప్రహరీని నిర్మించింది. ఐలాండ్ ఎదురుగా ఈ ప్రహరీ చెంతన ఆటోస్టాండ్ నడుస్తోంది. ఇక్కడ విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు, మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ వైపు వెళ్లాల్సిన బస్సులు ఆగుతున్నాయి. బందరు కాల్వ వెంబడి ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆక్రమణలు పెరుగుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో వీఎంసీ కర్మల భవనాలను నిర్మించింది. ఇవి కాకుండా ప్రార్థనా మందిరాలు, ఆలయాలు ఒక్కో ప్రదేశంలో వెలిశాయి. నగరం నుంచి ప్రవహించే కాల్వల్లో జలవనరుల శాఖ పూడికతీత చేసిన దాఖలు ఇప్పటి వరకు కనిపించలేదు. కొన్ని ప్రదేశాల్లో మాత్రం వీఎంసీ సుందరీకరణ కోసం పార్కులు అభివృద్ధి చేసింది. పచ్చదనం కోసం మొక్కలు పెంచుతోంది. ధర్మచక్రం ఎదురుగా ప్రహరీకి వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో భారీ బస్‌బేను నిర్మిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన ట్రాఫిక్ అధికారులకు వచ్చింది. ఈ స్థలం జలవనరుల శాఖ పరిధిలో ఉంది. బాధ్యతలను వీఎంసీ చూస్తోంది. బస్‌బే నిర్మించాల్సిన బాధ్యత ఆర్టీసీది. ట్రాఫిక్ అధికారుల ప్రణాళికలు పట్టాలు ఎక్కాలంటే ఆర్టీసీ, జలవనరుల శాఖ, వీఎంసీ, పోలీసుల శాఖ మధ్య సమన్వయం ఉండాలి.

ప్రతిపాదనలు ఇలా..

- ధర్మచక్రం ఎదురుగా గల ఖాళీ స్థలంలో భారీ బస్‌బేను నిర్మించవచ్చు.
- విజయవాడ-విశాఖపట్నం, విజయవాడ-గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లే బస్సులను ఈ బస్‌బేలో ఆపొచ్చు.
- ప్రస్తుతం ఐల్యాండ్‌కి వెనుక వైపున గుంటూరు మార్గంలో ఉన్న బస్టాప్‌ను ఇక్కడికి మార్చుకోవచ్చు.
- ఈ నిర్ణయం వల్ల ఐల్యాండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుంది.
- విశాఖపట్నం, గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లాల్సిన బస్సులు నేరుగా బస్‌బేలోకి వస్తాయి. ఈ బస్సులను ప్రస్తుతం జాతీయ రహదారిపై ఆపుతున్నారు. ఈ బస్సులను బస్‌బేల్లోకి పంపడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బంది ఉండదు.
- గుంటూరు మార్గంలో ఉన్న బస్టాప్ వద్ద రద్దీ చాలా వరకు తగ్గుముఖం పడుతుంది.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు

- బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అత్తులూరి
- అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

లబ్బీపేట, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో పేరుకుపోయిన దాదాపు రూ.2 వేల కోట్ల కాంట్రాక్టర్ల బిల్లులు సకాలంలో చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అత్తులూరి నాగమల్లేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బందర్ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం బీఏఐ 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.800 కోట్ల బకాయిలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇంకా రూ.2 వేల కోట్లు వరకు వివిధ శాఖల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్ రెడ్డి, రాష్ట్ర మాజీ చైర్మన్ బి.రాఘవరావు, జాతీయ మాజీ ఉపాధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పేర్ని జయసుధ ముందస్తు బెయిల్‌పై విచారణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పొట్లపాలెం శివారు కొత్తపూడిలోని బఫర్ గిడ్డంగిలో బియ్యం మాయమైన కేసులో నిందితురాలు పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు. తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టులో స్పెషల్ పీపీ విజయ తన వాదనను వినిపించనున్నారు.

గుంటుపల్లిలో చోరీకి యత్నం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంట్‌లో చోరీకి యత్నించిన నిందితులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందిగామ రమణ కాలనీకి చెందిన ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు చెత్త పేపర్లు ఏరుకునేందుకు ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి సమీపంలోని కాజీపేట వద్దకు గురువారం వచ్చారు. వీరిలో గంధసిరి నాగరాజు అనే వ్యక్తి అపార్ట్‌మెంట్ బయట ఉన్న స్టోర్ రూమ్‌లో ఉన్న విలువైన స్క్రాప్‌ను చోరీ చేస్తుండగా గుర్తించిన గ్రామస్తులు అతడ్ని పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతనితో పాటు వచ్చిన మరో నలుగుర్ని కూడా పోలీసులు స్టేషన్‌లో ఉంచి విచారణ చేస్తున్నారు.

సోషల్ ఆడిట్ ఆఫ్ క్యాస్ట్ సర్వేపై అభ్యంతరాలను తెలియజేయండి

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూలు కులాలకు సంబంధించి సోషల్ ఆడిట్ ఆఫ్ క్యాస్ట్ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ సర్వేపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో క్యాస్ట్ సర్వేను నిర్వహించిందని, సంబంధిత వివరాలను అన్ని గ్రామ, వార్డు సచివా లయాల్లో ప్రదర్శనగా ఉంచుతారని పేర్కొన్నారు. వీటిని పరిశీలించి ఈ నెల 26 తేదీ నుంచి జనవరి 6వ తేదీవరకు అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయడానికి అవకాశం ఇచ్చామని తెలిపారు. జనవరి 10వ తేదీ నాటికి వార్డు సచివాలయాల్లో తుది సర్వే జాబితాలను ప్రచురించి పరిశీలన కోసం అందుబాటులో ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఏకసభ్య కమిషన్‌కు అభిప్రాయాలు తెలియజేయండి : కలెక్టర్

చల్లపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాలలోని ఉప వర్గీకరణపై విచారణ కోసం ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌కు అభిప్రాయాలు తెలియజేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మచిలీపట్నం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో రాజీవ్ రంజన్ మిశ్రా నేరుగా విజ్ఞప్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కమిషన్‌కు నేరుగా విజ్ఞప్తులు సమర్పించలేని వారు ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ మొఘల్రాజపురం కోనేరు లక్ష్మయ్య వీధిలోని మొదటి అంతస్థులో ఉన్న గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కార్యాలయ పనిదిన వేళల్లో(ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలు) వ్యక్తిగతంగా, తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా ఈ మెయిల్ ద్వారా జనవరి 9వ తేదీ వరకు విజ్ఞప్తులు సమర్పించవచ్చని తెలిపారు.

నగ్న దొంగ అరెస్టు

- దుస్తులు లేకుండా చోరీలు
- ఖాళీ స్థలాలకు పక్కన ఉన్న నివాసాలే టార్గెట్
- సీసీఎస్ పోలీసులకు చిక్కిన అంతరాష్ట్ర దొంగ
- రూ.26లక్షల విలువ చేసే బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం
- చోరీల సొమ్ములతో విలాసవంతమైన భవన నిర్మాణం

విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఒంటిపై దుస్తులు లేకుండా తిరుగుతాడు. తెలికపాటి వస్తువులను కొక్కీలుగా మార్చేశాడు. ఈ రెండు లక్షణాలు విన్న తర్వాత ఎవరైనా అతడ్ని అఘోరా గానో, ఇంజనీర్‌గానో ఊహించుకుంటారు. అతడు ఈ రెండు లక్షణాలు కలగలిపిన కరుడుగట్టిన నేరగాడు. అంతరాష్ట్ర పోలీసుల రికార్డులు అతడు చేసిన నేరాలు పేజీల కొద్దీ ఉన్నాయి. ఒక్కసారి నేరం చేసిన తర్వాత అతడు పోలీసులకు చిక్కడం చాలా కష్టం. చేతులకు సంకెళ్లు పడకుండా ఎన్నో ఎత్తులు వేసిన ఆ నేరగాడిని విజయవాడ సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వర్‌రెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావుతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం వెల్లడించారు.

చిన్నతనం నుంచి దొంగతనాలు

గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన కంచర్ల మోహనరావు ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నతనంలోనే దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా వివిధ నేరాల్లో జైలుకు వెళ్లి రావడంతో తర్వాత తర్వాత కరుడుగట్టిన నేరగాడిగా మారిపోయాడు. ప్రస్తుతం కాకినాడ జిల్లా తుని మండలం మరువాడ గ్రామంలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. అక్కడి నుంచి చోరీలకు బయలుదేరతాడు. గంజాయి, మద్యంతాగడానికి బానిసగా మారాడు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో అక్టోబరు పదో తేదీన ఎంఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోయింది. ఉదయం నిద్ర లేచి చూసే



నిందితుడు మోహనరావును మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీస్ అధికారులు

సరికి కిటికీ నుంచి ప్రధాన ద్వారం తలుపు గడియను తీసి లోపలకు ప్రవేశించాడు. కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించాడు. దీనితోపాటు ఈ అపార్టుమెంట్‌కు వెనుక వైపు ఉన్న ఇంట్లో తాళాలు పగలుగొట్టి చోరీ చేశాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తును సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ చేపట్టారు. చోరీలు జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా అందులో మోహనరావు ముఖం కనిపించింది. మోహనరావు వద్ద నుంచి రూ.26లక్షల విలువ చేసే 349 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.

నెల్లూరు నుంచి ఎస్.కోట వరకు..

మోహనరావు నెల్లూరులో ఉన్నట్టు పోలీసులకు ఉప్పందింది. దీనితో సీసీఎస్‌లోని ఒక బృందం అక్కడికి వెళ్లగా పరారయ్యాడు. తర్వాత కొన్ని రోజులకు అతడు విజయవాడలో ఉన్నట్టు సమాచారం తెలిసింది. ఈ సమాచారం అందిన కొద్దిసేపటికి హనుమాన్ జంక్షన్‌లో ఉన్నట్టు మరో సమాచారం లభించింది. దీనితో నిందితుడు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నాడని అనుమానించి పీఎన్‌బీఎస్‌కు వెళ్లారు. తుని వైపునకు వెళ్లే బస్సులను పరిశీలించగా అక్కడ మోహనరావు ఛాయలు కనిపించలేదు. పీఎన్‌బీఎస్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే ఎస్.కోట వెళ్లే బస్సు ఎక్కినట్టు దృశ్యాలు కనిపించాయి. అప్పటికే ఎస్.కోటకు బయలుదేరిన బస్సు ఎక్కేశాడు. ఇక్కడ విచారణ కేంద్రంలో ఎస్.కోటకు వెళ్లిన బస్సుల డ్రైవర్ల ఫోన్ నంబర్లు, వివరాలు నమోదు కాలేదు. దీనితో వెంటనే ఎస్.కోట డిపో మేనేజర్‌తో ఫోన్‌లో టచ్‌లోకి వెళ్లారు. పీఎన్‌బీఎస్ నుంచి ఎస్.కోటకు బయలుదేరిన బస్సుల డ్రైవర్ల నంబర్లను తీసుకున్నారు. వారికి మోహనరావు ఫొటోను వాట్సాప్‌లో పంపగా ఒక బస్సు డ్రైవర్ తన బస్సులో ఉన్నట్టు సమాచారం ఇచ్చాడు. ఆ బస్సు ఎక్కడుందో తెలుసుని విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో లక్ష్మీనారాయణ టీం బయలుదేరింది. సరిగ్గా రాజమండ్రిలోని దివాన్‌చెరువు వద్ద కాపుగాచి ఎస్.కోట బస్సును తనిఖీ చేయగా మోహనరావు ముఖానికి మాస్క్ ధరించి ఒక మూలన కూర్చున్నట్టు గుర్తించారు. అతడ్ని అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చి విచారించగా నేరాల చిట్టా వెలుగులోకి వచ్చింది. ఒకసారి చోరీ చేసిన తర్వాత రెండేళ్ల వరకు చిక్కడని పోలీసులకు ఒక నమ్మకం. విజయవాడ పోలీసులకు చిక్కడానికి రెండు నెలల ముందు హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యాడు.

వంటిపై దుస్తుల్లేకుండా చోరీలు

మోహనరావును విచారించే క్రమంలో పోలీసులకు అనేక కొత్త విషయాలు తెలిశాయి. సాధారణంగా చోరీలు చేయడాన్ని వ్యసనంగా మార్చుకున్న నేరగాళ్లు గ్యాంగ్‌లను నిర్వహిస్తారు. ఇద్దరు, ముగ్గురు కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడి చోరీలు చేస్తారు. మోహనరావు దీనికి భిన్నంగా నేరాలు చేస్తాడు. ఎక్కడ చోరీలు చేయాలనుకున్నా ఒంటరిగా వెళ్తాడు. దీనికి ముందుగా నేరం చేయాలనుకున్న ప్రదేశంలో రెండు, మూడు రెక్కీలు నిర్వహిస్తాడు. ఇంట్లో మనుషులు ఉన్నా, లేకపోయినా చోరీ చేయాలని నిర్ణయించుకున్న తర్వాత దాన్ని నెరవేర్చుకుంటాడు. చోరీ చేయాలనుకున్న ఇంటికి పక్కనే ఖాళీ స్థలం ఉంటేనే దాన్ని ఎంచుకుంటాడు. దొంగతనం చేయడానికి బయలుదేరినప్పుడు ఆ ఇంటికి సమీపంలో పాడుబడిన భవనంలోకి గానీ, తుప్పల్లోకి గానీ వెళ్తాడు. అక్కడ మొత్తం దుస్తులను తీసేస్తాడు. ఆ తర్వాత గోడ దూకి ఆ ఇంట్లోకి ప్రవేశిస్తాడు. అనుకున్న పని సజావుగా జరిగిన తర్వాత మళ్లీ దుస్తులు ధరించి అక్కడి నుంచి వెళ్లిపోతాడు. కొంతదూరం వచ్చిన తర్వాత ఉపయోగించిన ఫోన్, సిమ్‌కార్డులను పడేస్తాడు. రూ.1000 విలువ చేసే ఫోన్లు మాత్రమే ఉపయోగిస్తాడు. ఇలా కాజేసిన సొత్తును రెండు, మూడు చోట్ల విక్రయించేస్తాడు. ఈ సొమ్మును తీసుకుని తునికి వెళ్తాడు. నేరుగా ఇంటికి వెళ్లకుండా తన బావమరిదికి కబురుపెడతాడు. తాను ఏ లాడ్జిలో ఉంటున్నాడో బావమరిదికి చెబుతాడు. భార్యపిల్లలను ఆ లాడ్జికి రప్పించుకుంటాడు. డబ్బును ఆమెకు ఇస్తాడు. కాసేపు భార్యపిల్లలతో అక్కడే ముచ్చటిస్తాడు. తర్వాత మళ్లీ దొంగతనాలు చేసే ఇళ్లను ఎంచుకునే పనిలో నిమగ్నమవుతాడు. తునికి సమీపంలో రూ.80లక్షలతో భారీ భవనాన్ని నిర్మిస్తున్నట్టు సమాచారం. కంచర్ల మోహనరావుపై రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ అనేక కేసులు ఉన్నాయి విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజమండ్రి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, హైదరాబాద్‌లో సుమారుగా 40 కేసులు ఉన్నాయి.

నన్ను ఎలా పట్టుకున్నారో చెప్పండి ప్లీజ్..

ఏదైనా నేరంలో చిక్కినప్పుడు నిందితులను పోలీసులు ప్రశ్నిస్తారు. సీసీఎస్ పోలీసులను మాత్రం నిందితుడు మోహనరావు ప్రశ్నించాడు. తనను ఎలా పట్టుకున్నారో చెప్పాలని పలుమార్లు అడిగాడు. మోహనరావు చోరీ చేసిన తర్వాత పోలీసులకు చిక్కడానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. అతడు ఎక్కడున్నాడో సమాచారం తెలుసుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. చర్లపల్లి జైలు నుంచి బయటకు రాగానే సీసీఎస్ పోలీసులకు చిక్కడంతో ఈ ప్రశ్న వేసినట్టు తెలిసింది.

ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలి

- మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్
- ఘనంగా సంజా ఉత్సవ్ ప్రారంభం



సంజా ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న తేజ్ భరత్

పటమట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనే నినాదంతో సంజా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. గురువారం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మారిస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో సంజా ఉత్సవ్ ఎస్‌హెచ్‌జీ-2024ను మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్, అడిషనల్ కమిషనర్ జనరల్ వీఎంసీ సంస్థ డాక్టర్ డి.చంద్రశేఖర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2.0లో భాగంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారి ఉండాలనే ఉద్దేశంతో సంజా ఉత్సవ్ పేరుతో ఇటువంటి మేళా ఏర్పాటు చేశామన్నారు. వీఎంసీ ప్రాజెక్టు అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ప్రాజెక్టు ఆఫీసర్(యూసీడీ) పి.వెంకట నారాయణ ఫణికుమార్, సుజాత పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	113, 121, 132
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

పారిశుధ్య పనుల పరిశీలన

గుడివాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రెయిన్‌లో పేరుకు పోయిన పూడిక తొలగింపును మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నీలామహల్ రోడ్డు, బంటుమిల్లి రోడ్డు, రైలుపేట, టైల రింగ్ వీధి, బస్టాండ్ రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం 35వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిల వసూళ్లపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ ఆర్.ఐ మల్లికార్జునరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.





గుడివాడలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు



గుడివాడలో వీఎం రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు సేవాసమితి నాయకులు



పామర్రులో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

ప్రజా నాయకుడు వీఎం రంగా

గుడివాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా స్వార్థ రాజకీయాలకు బలయ్యారని, ఆయన ప్రజా నాయకుడిగా పేదల గుండెల్లో నిలిచారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం వంగవీటి రంగా 36వ వర్ధంతిని పురస్కరించుకుని ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద రంగా విగ్రహానికి గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌తో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకుడు పంద్రాజు సాంబశివరావు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, బీజేపీ పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేత మండలి హనుమంతరావు ఆధ్వర్యంలో....

భయ్యా వారి వీధిలోని తన కార్యాలయంలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దుడ్డు చిన్నా, షేక్ సయ్యద్, షేక్ బాజీ, తోట శివాజీ, ఆంజనేయప్రసాద్, శేఖర్, కృష్ణ, రామ్మోహనరావు, ప్రసాద్; ఖాదర్‌బేగ్, రాజేస్, మద్దాలి సురేఖ, రమీజా పాల్గొన్నారు.

జనసేన నియోజకవర్గ కార్యాలయంలో..

ఆంజనేయపేటలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కూటమి నాయకులు పంద్రాజు సాంబశివరావు, మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, ఇంటూరి గజేంద్ర పాల్గొన్నారు.

కాపు సేవా సమితి ఆధ్వర్యంలో..

ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద గల వీఎం రంగా విగ్రహానికి గుడివాడ కాపు సేవా సమితి నాయకులు నివాళులర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు నరహరశెట్టి ప్రసాద్, ఆత్మూరి మల్లేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణ, పూర్వాధ్యక్షుడు సుంకర గాంధీ, నాయకులు వెంకట్, నోబుల్ నాయుడు, నల్లగంచు రాంబాబు, దారపురెడ్డి మల్లేశ్వరరావు, చంద్రశేఖరరావు, సూర్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

రంగా వర్ధంతిని పురస్కరించుకుని రాధా-రంగా మిత్ర మండలి, జనసేన ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాధా-రంగా మిత్ర మండలి గుడివాడ శాఖ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద, బేతవోలులో అన్నదానం చేశారు. రాధా-రంగా మిత్రమండలి అధ్యక్షుడు వడ్డే గిరి, జనసేన జిల్లా నాయకుడు పాలంకి సారథిబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో..

పామర్రు: మండలంలో రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో రంగా వర్ధంతి కారక్రరమాలను నిర్వహించారు. పామర్రు తోట రామాలయం సెంటర్‌లో రంగా విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, రాధా-రంగా మిత్రమండలి అధ్యక్షుడుతాడిశెట్టి సాంబశివరావుతో కలిసి కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లారిపల్లి గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు రంగా అందించిన సేవలను కొనియాడారు. రంగా ఆశయాసాధనకు యువత కృషిచేయాలన్నారు. అనంతరం తాడిశెట్టి నాగేశ్వరరావు(పాము) యూత్ ఆధ్వర్యంలో పెదమద్దాలి, కొండిపర్రు గ్రామాల్లో రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. రాపర్ల, ఉండ్రపూడి, పోలవరం గ్రామాల్లో రంగా విగ్రహాలకు అభిమానులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. తాడిశెట్టి మధు, అల్లంశెట్టి సురేష్, చొప్పకట్ల రమేష్, సిద్దంశెట్టి ముక్కా ఆంజనేయులు, దాసరి కొండ పాల్గొన్నారు.



మల్లాయిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రామ్ శివ

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

గుడివాడ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మల్లాయిపాలెంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రామ్‌శివ అన్నారు. గురువారం మల్లాయిపాలెం సచివాలయంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో 10 అర్జీలు

పెదపారుపూడి: రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ వై.రంగారావు తెలిపారు. గురువారం పెదపారుపూడి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించి, 10 అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. రీ సర్వే డీటీ సుందరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ

- గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

పామర్రు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగదు చెల్లింపు విషయంలో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి విజయవాడ ఆస్పత్రిలో మృతిచెందాడు. దీనిపై సీఐ శుభాకర్ గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పామర్రు చాట్లవానిపురానికి చెందిన చాట్ల వెంకటేశ్వరరావు(52), చాట్ల సతీష్(22) కూలి పనులు చేస్తుంటారు. సతీష్‌కు వెంకటేశ్వరరావు రూ.300 బకాయి ఉన్నాడు. బకాయి విషయంలో మద్యం మత్తులో ఉన్న వారి ఇద్దరి మధ్య ఈనెల 20వ తేదీ రాత్రి ఘర్షణ జరిగింది. సతీష్‌పై వెంకటేశ్వరరావు కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను అంబులెన్సులో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడు వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

జిల్లాకు మణిహారం బందరు పోర్టు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు బందరు పోర్టు మణిహారంగా మిగిలిపోతుందని, పోర్టు నిర్మాణం పూర్తయితే లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. గురువారం పోర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సైట్ ఇంజనీర్ అనగాని ప్రసాద్ పనుల పురోగతిని వివరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

బంటుమిల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్తమూరులో 150 ఏళ్ల చరిత్ర కలిగిన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి నూతన ఆలయ పునర్నిర్మాణానికి గురువారం ఆలయ ట్రస్టీ మద్దిరాల సరోజ, పూట్ల సుధాకర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఆగమ పండితులు ఐలూరు జయకిషోర్, విశ్వనాథం సమక్షంలో గణపతి పూజ, హోమం నిర్వహించారు.

అంబేడ్కర్‌పై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నిరసన

బంటుమిల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బంటుమిల్లిలో వారు నిరసన తెలిపారు. గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని కేవీపీఎస్ జిల్లా కమిటీ కార్యదర్శి రాజేష్ ఆరోపించారు.



గుడివాడలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు



కూచిపూడిలో పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

పేదలకు అండ ఎర్రజెండా

సీపీఐ శత వసంతాల వేడుకల్లో నాయకులు

గుడివాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్ని వేళలలా అండగా నిలిచి వారి సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అన్నారు. గురువారం ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో భారతీయ కమ్యూనిస్టు పార్టీ 100వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తొలుత పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అధికార పార్టీలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటామని గూడపాటి అన్నారు. సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, రైతు నాయకులు గుడిపూడి బాబూరావు, సభ్యులు పి.రంగారావు, జి.శేషు, కె.వెంకన్న, డి.అర్జున్, కె.జోజి, పి.గిరి, కె.నాని పాల్గొన్నారు.

కూచిపూడిలో..

సీపీఐ వంద సంవత్సరాల వేడుకలను కూచిపూడిలో గురువారం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిపాటి నాగేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కూచిపూడి సెంటర్‌లో కోదాటి నారాయణరావు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, నేతలు చెరకు శ్రీనివాసరావు, కె.వి.అప్పారావు, చందోలు నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, బోరుకాటి నరసింహరాజు, నందం వెంకటేశ్వరరావు, సద్గుణరావు పాల్గొన్నారు.



కూడూరు పాల సంఘంలో రైతులతో మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

పెడన రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ అందించే సెమన్ ద్వారా పుట్టిన దూడలు భవిష్యత్తులో ఎక్కువ పాల చార కలిగిన పశువులుగా రైతులకు లాభాలు చేకూర్చిపెడతాయని, పాడి రైతుల సంక్షేమం కోసం యూనియన్ అనేక పథకాలను అమలు చేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పల్లెకుపోదాం పాడిని చూద్దాం కార్యక్రమంలో భాగంగా గురువారం నందిగామ, కూడూరు పాల సంఘాలను సందర్శించి పాడి రైతులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. 10 శాతం బోనస్‌తో కలిపి లీటరు పాలకు రూ.90.20 పైసలు చెల్లిస్తున్నామన్నారు. పశుబీమా, డీ వార్మింగ్, పశుదాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూనియన్ పాలకవర్గ సభ్యుడు అర్జా వెంకటనగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ బసవరాజ్‌కుమార్, నందిగామ, కూడూరు పాల సంఘాల అధ్యక్షులు జన్ను సీతయ్య, కాగిత వెంకట్రావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో కలెక్టర్ బాలాజీ

మోపిదేవి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డీకే బాలాజీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం కుటుంబసభ్యులు, మిత్రులతో కలిసి సం దర్శించారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను కలెక్టర్‌కు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.వాణి, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీకి స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో శ్రీరామవరప్రసాదరావు



మలకాపట్నం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

మాదిగలు రేపు బందరు తరలిరండి

- వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌కు అభిప్రాయాలు తెలపండి
- ఎంఈఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ విక్టర్‌బాబు పిలుపు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జడ్పీ కన్వెన్షన్ హాలులో శనివారం రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు సేకరిస్తుందని, తమ అభిప్రాయాన్ని వినతుల రూపంలో చెప్పేందుకు మాదిగ, ఉపకులాలవారు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు కదలిరావాలని ఎంఈఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరపల్లి విక్టర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం మలకాపట్నం సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు ప్రదర్శన నిర్వహించారు.

అంధకారంలో హైవే, అండర్‌పాస్‌లు



ఉయ్యూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై రోజుల తరబడి వీధిలైట్లు వెలగక చిమ్మచీకట్లు అలుముకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై కంకిపాడు మండలం నుంచి పామర్రు మండలం వరకు పొడవునా లైట్లు వెలగక స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారిపై కంకిపాడు, ఆకునూరు, ఉయ్యూరు, మంటాడ, తాడంకి, కురుమద్దాలి, పామర్రు వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్ల వెంబడి కూడా రోజుల తరబడి లైట్లు వెలగక పోవడంతో పరిసరగ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కార్లు ఇతర వాహనాల నుంచి ముక్కుపిండి టోల్‌గేట్ వసూలు చేసే హైవే అథారిటీ రోడ్లు, లైట్ల నిర్వహణ పట్టించుకోపోవడం పట్ల ప్రజల్లో సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి హైవేపైన, సర్వీస్ రోడ్ల వెంబడి, అండర్ పాస్‌ల్లో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113, 121, 132
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.600

రేపు మండల సమావేశం

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీవో మరియకుమారి తెలిపారు. సమావేశానికి ఎంపీపీ తుంగల సుమతీదేవి అధ్యక్షత వహిస్తారని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె సూచించారు.

రేపు కౌన్సిల్ సమావేశం

పెడన, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ ఎం.గోపాలరావు తెలిపారు. అజెండాలోని 22 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో కలెక్టర్ బాలాజీ

మోపిదేవి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డీకే బాలాజీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం కుటుంబసభ్యులు, మిత్రులతో కలిసి సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను కలెక్టర్‌కు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.వాణి, ఆర్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీకి స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో శ్రీరామవరప్రసాదరావు



మలకాపట్నం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

మాదిగలు రేపు బందరు తరలిరండి

- వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌కు అభిప్రాయాలు తెలపండి
- ఎంఈఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ విక్టర్‌బాబు పిలుపు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జడ్పీ కన్వెన్షన్ హాలులో శనివారం రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు సేకరిస్తుందని, తమ అభిప్రాయాన్ని వినతుల రూపంలో చెప్పేందుకు మాదిగ, ఉపకులాలవారు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు కదలిరావాలని ఎంఈఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరపల్లి విక్టర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం మలకాపట్నం సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు ప్రదర్శన నిర్వహించారు.

సంఘ్ పరివార్ అభివృద్ధికి దుర్గాప్రసాద్ కృషి

అవనిగడ్డ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంఘ్ పరివార్ ఒడిసా ప్రచారక్‌గా దివంగత భోగాది దుర్గా ప్రసాద్ చేసిన సేవలు మరువలేనివని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. దివంగత భోగాది దుర్గాప్రసాద్ 53వ సంస్మరణ సభ అవనిగడ్డలో గురువారం నిర్వహించారు. దుర్గాప్రసాద్ చిత్రపటానికి సోము వీర్రాజు నివాళులర్పించారు. ఆరోగ్యభారతి అఖిల భారతీయ సహ సంఘటన కార్యదర్శి డాక్టర్ ఆర్.మురళీకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, భోగాది రమాదేవి, చిరువోలు బుచ్చిరాజు పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు



బంటుమిల్లిలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నిరసన

బంటుమిల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బంటుమిల్లిలో వారు నిరసన తెలిపారు. గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని కేవీపీఎస్ జిల్లా కమిటీ కార్యదర్శి రాజేష్ ఆరోపించారు.



అనుముల నాగమల్లేశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బొడ్డు వేణుగోపాలరావు

అనుముల నాగమల్లేశ్వరమ్మకు నివాళి

పెడన, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన టీడీపీ 14వ వార్డు కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ సంస్మరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. నాగమల్లేశ్వరమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు నివాళులర్పించారు.

జిల్లాకు మణిహారం బందరు పోర్టు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు బందరు పోర్టు మణిహారంగా మిగిలిపోతుందని, పోర్టు నిర్మాణం పూర్తయితే లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. గురువారం పోర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సైట్ ఇంజనీర్ అనగాని ప్రసాద్ పనుల పురోగతిని వివరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

బంటుమిల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్తమూరులో 150 ఏళ్ల చరిత్ర కలిగిన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి నూతన ఆలయ పునర్నిర్మాణానికి గురువారం ఆలయ ట్రస్టీ మద్దిరాల సరోజ, పూట్ల సుధాకర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఆగమ పండితులు ఐలూరు జయకిషోర్, విశ్వనాథం సమక్షంలో గణపతి పూజ, హోమం నిర్వహించారు.



మచిలీపట్నం రేవతిసెంటర్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొల్లు పునీత్



కృత్తివెన్ను మండలం నీలిపూడిలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్



చల్లపల్లిలో నివాళులర్పిస్తున్న అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ చిలకలపూడి పాపారావు



అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రి సమీపంలోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు, కూటమి నాయకులు

పేదల పెన్నిధి వీఎం రంగా

36వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన నాయకులు, అభిమానులు

మచిలీపట్నం టౌన్/కృత్తివెన్ను/చల్లపల్లి/అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/నాగాయలంక/కోడూరు/ఘంటసాల/పెడన రూరల్/గూడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా ఎవరికి ఏ కష్టం వచ్చినా మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఆదుకునేవారని, ఆయన పేదల పెన్నిధి అని, పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. వీఎం రంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం మచిలీపట్నంలోని తన కార్యాలయంలో రంగా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. మచిలీపట్నం రేవతీ సెంటర్‌లోని రంగా విగ్రహానికి, చిలకలపూడిలోని రంగా విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మంత్రి కొల్లు రవీంద్ర తనయుడు కొల్లు పునీత్, రాధా-రంగా మిత్ర మండలి నాయకుడు బుల్లెట్ ధర్మారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ వైస్‌చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు నివాళులర్పించారు. బందరు మండలం కానూరులో రంగా విగ్రహానికి గోపు సత్యనారాయణ నివాళులర్పించారు.

కృత్తివెన్ను మండలంలో..

నీలిపూడిలో రంగా వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పాల్గొన్నారు. రంగా విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. యండపల్లి, గాంధీనగరం గ్రామాల్లో కూటమి నాయకులు రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. చెరుకుమిల్లి, లక్ష్మీపురం రంగాసెంటర్, చినగొల్లపాలెం, సంగమూడి, కృత్తివెన్ను, చినపాండ్రాక, శీతనపల్లి, కొమాళ్లపూడి, మునిపెడ, పోడు గ్రామాల్లో రంగా వర్ధంతి కార్యక్రమాలను అభిమానులు జరుపుకొన్నారు. పిన్నెంటి రత్తయ్య, దాసరి శ్రీనివాసరావు, కూనసాని శ్రీనివాసరావు, పిన్నెంటి ప్రభాజీ, పుప్పాల నరసింహారావు, పుప్పాల చిన్నా పాల్గొన్నారు.

చల్లపల్లి పడమర వీధిలో..

వీఎం రంగా విగ్రహానికి అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ చిలకలపూడి పాపారావు నివాళులర్పించారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, పాగోలు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, బచ్చు వెంకటనాథ్, రాజనాల మాణిక్యాలరావు, రావి చిట్టి, గుడివాక శివరావు, బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రి సమీపంలోని వంగవీటి మోహన రంగా, దామెర్ల చిన్నబ్బాయ్‌ల విగ్రహాలకు అభిమానులు నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నేతృత్వంలో రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. గాంధీక్షేత్రంలో కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రంగా వర్ధంతిని నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, యాసం చిట్టిబాబు, జనసేన నేతలు మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు పాల్గొన్నారు. కొత్తపేట, మోదుమూడిలో రంగా విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నివాళులర్పించారు. మోదుమూడిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అందె శ్రీరామమ్మూర్తి ఆధ్వర్యంలో నరహరశెట్టి ఈశ్వరరావు నివాళులర్పించారు.

నాగాయలంకలో..

బస్టాండ్ రోడ్డులో రంగా విగ్రహానికి డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మత్తి రాజా, లకనం నాగాంజనేయులు నివాళులర్పించారు. నాగాయలంక పంచాయతీ పారిశుధ్య కార్మికులు 21 మంది నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

గూడూరులో

గాంధీబొమ్మ సెంటర్‌లో రంగా విగ్రహానికి డీసీ చైర్మన్ పోతన స్వామి నివాళులర్పించారు. వృద్ధులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కూటమి నాయకులు దాసరి ఉమాసాయిరాం, పోతన రామోజీ, ఎస్ఏ బేగ్, బాసంశెట్టి విజయ్, పోతన రంగా, శాత కుమారస్వామి, సాయి, అయ్యప్ప పాల్గొన్నారు. గూడూరు వైసీపీ కార్యాలయంలో పర్లం మహాలక్ష్మయ్యనాయుడు ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి వైసీపీ నాయకులు నివాళులర్పించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు పాల్గొన్నారు. తరకటూరులో ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు రంగా చిత్రపటానికి నివాళులర్పించారు.

కోడూరులో..

ప్రధాన సెంటర్‌లో రంగా విగ్రహానికి కొండవీటి రామకృష్ణ, బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో బీజేపీ, జనసేన నేతలు నివాళులర్పించారు. పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. బడే కృష్ణ, కడవకొల్లు మల్లికార్జునరావు, గుడివాక జనార్దనరావు పాల్గొన్నారు.

పూషడంలో..

ఘంటసాల మండలం పూషడంలో వీఎం రంగా విగ్రహానికి సర్పంచ్ అంకం మారుతీరావు నివాళులర్పించారు. గల్లా సుబ్రహ్మణ్యం, అంకం వెంకటేశ్వరరావు, చీడేపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెడన మండలంలో..

చేవేంద్రపాలెం, బల్లిపర్రు, చెన్నూరు, చేవేంద్ర, నడుపూరు, పెనుమల్లి, కమలాపురం, శేరీవర్ధర్లపల్లి గ్రామాల్లో రంగా విగ్రహాలకు అభిమానులు నివాళులర్పించారు.



కూడూరు పాల సంఘంలో రైతులతో మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

పెడన రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ అందించే సెమన్ ద్వారా పుట్టిన దూడలు భవిష్యత్తులో ఎక్కువ పాల చార కలిగిన పశువులుగా రైతులకు లాభాలు చేకూర్చిపెడతాయని, పాడి రైతుల సంక్షేమం కోసం యూనియన్ అనేక పథకాలను అమలు చేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పల్లెకుపోదాం పాడిని చూద్దాం కార్యక్రమంలో భాగంగా గురువారం నందిగామ, కూడూరు పాల సంఘాలను సందర్శించి పాడి రైతులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. 10 శాతం బోనస్‌తో కలిపి లీటరు పాలకు రూ.90.20 పైసలు చెల్లిస్తున్నామన్నారు. పశుబీమా, డీ వార్మింగ్, పశుదాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూనియన్ పాలకవర్గ సభ్యుడు అర్జా వెంకటనగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ బసవరాజ్‌కుమార్, నందిగామ, కూడూరు పాల సంఘాల అధ్యక్షులు జన్ను సీతయ్య, కాగిత వెంకట్రావు పాల్గొన్నారు.

ఎడ్లబండ్లతో ఇసుక తరలింపు

- నలుగురు యజమానులకు జరిమానా

మోపిదేవి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెంలో కృష్ణానది నుంచి అనుమతి లేకుండా నాలుగు ఎడ్ల బండ్లతో ఇసుకను తరలిస్తున్న యజమానులకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. గ్రామానికి చెందిన ఆరుంబాక కోటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు, చందన మంగారావు, సనకా వీర శివనాయుడు కృష్ణానది నుంచి ఎడ్ల బండ్లతో ఇసుకను రవాణా చేస్తుండగా వీఆర్వో కె.వరప్రసాద్, వీఆర్ఏ అడ్డగించి తహసీల్దార్ కార్యాలయానికి బండ్లను అప్పగించారని తెలిపారు. ప్రథమ తప్పిదంగా ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున, నలుగురికి మొత్తం రూ.6 వేలు జరిమానా విధించామని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఘంటసాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఘంటసాలపాలెం చిన దళితవాడకు చెందిన ఉప్పులేటి సుదర్శన్-లావణ్య దంపతుల గృహంలో అక్టోబరు 31న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయారని తెలుసుకున్న కూచిపూడి ఆర్సీఎం చర్చి ఫాదర్ జాకబ్‌ప్రసాద్ గురువారం సాయమందించారు. రూ.40 వేల విలువైన డబుల్ కాట్ మంచం, బీరువాను సుదర్శన్ దంపతులకు అందజేశారు. సుదర్శన్ కుమారులకు నూతన వస్త్రాలు, గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు అందించారు. హోలీ స్పిరిట్ కాన్వెంట్ సిస్టర్స్ రూ.15 వేలు, సోషల్ సర్వీస్ సెంటర్ విజయవాడ వారు రూ.8వేలు సహాయం చేసినట్లు ఫాదర్ జాకబ్ ప్రసాద్ తెలిపారు.



గోదాదేవికి సారె

చల్లపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గీతామందిరంలో నిర్వహిస్తున్న గోదాదేవి ఉత్సవాల్లో 11వ రోజు గురువారం ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో మహిళలు ఊరేగింపుగా సారె తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. సంఘం అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, కార్యదర్శి వరదా హరిగోపాల్, కోశాధికారి తమ్మన సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

గోదాదేవికి సారె తీసుకెళుతున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు, మహిళలు

సీపీఐ శత వసంతాల వేడుక

చల్లపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత వసంతాల వేడుక నియోజకవర్గ పరిధిలో గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చల్లపల్లి, వక్కలగడ్డ, నడకుదురు, నిమ్మగడ్డ, వెలివోలు, శ్రీకాకుళం, చినకళ్లేపల్లి, మోపిదేవి గ్రామాల్లో పార్టీ కార్యదర్శులు ఎర్రజెండాను ఆవిష్కరించారు. వక్కలగడ్డలో సీపీఐ సీనియర్ నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ చరిత్రలో పీడిత ప్రజలపక్షాన అనేక ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమాల్లో నేతలు గుత్తికొండ రామారావు, నక్కా శ్రీనివాసరావు, మల్లుపెద్ది బోసు, రాజా, హనుమానుల రాణీకుమారి, కొల్లూరు శ్రీధర్, శేషు, దాసరి గోపాలకృష్ణ, మల్లుపెద్ది జగన్మోహనరావు పాల్గొన్నారు.

అరుణ పతాకావిష్కరణలు

ఘంటసాల: భారతీయ కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 100 వసంతాల ఉత్సవాలు శ్రీకాకుళం, గోగినేనిపాలెం, ఘంటసాల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని నేతలు ఆవిష్కరించారు.

కరగ్రహారంలో రెవెన్యూ సదస్సు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. గురువారం బందరు మండలం కరగ్రహారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తహసీల్దార్ మధుసూదనరావు, డీటీ సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. టీడీపీ రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, క్లస్టర్ ఇన్‌చార్జి తలారి సోమశేఖర్, సర్వేయర్ రాజబాబు, ఆర్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-నాగాయలంక): నాగాయలంకలో శాంతి థియేటర్‌కు ఎడమ వైపు రోడ్డులో వీధి స్తంభాల విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు భయపడుతున్నారు. పొడుగ్గా ఉన్నవారి చేతికి తగిలేలా వైర్లు వేలాడుతున్నాయని, ఈ రహదారిలో ఓ ప్రైవేట్ విద్యాసంస్థ ఉందని, విద్యార్థులను తీసుకెళ్లేందుకు బస్సులు తిరుగుతుంటాయని చెబుతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, వేలాడుతున్న విద్యుత్ వైర్లను తక్షణమే మార్చాలని కోరుతున్నారు.



శాంతి థియేటర్‌కు ఎడమ వైపు రోడ్డులో వేలాడుతున్న విద్యుత్‌తీగలు